# దైవ క్షేత్రానికి దగా!

**అయోధ్యతో పోలిక: అభివృద్ధి ఎక్కడ?**

ఉత్తర భారతదేశంలోని అయోధ్యలో శ్రీరాముడి కోసం చేపట్టిన అభివృద్ధి దేశంలోనే అతిపెద్ద మౌలిక వసతుల ప్రాజెక్టులలో ఒకటిగా మారింది. భక్తులు కోరుకుంటున్న పోలిక ఇదే.

**అయోధ్య (ఉత్తర భారతదేశం)**

- వేల కోట్ల రూపాయలు నిధులు (కేంద్రం %ూ% రాష్ట్రం)
- కొత్త ఎయిర్‌పోర్ట్, రైల్వే స్టేషన్ వంటి మౌలిక వసతులు
- విశాలమైన రోడ్లు ఆధునికీకరణ
- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం పర్యాటక ప్రాధాన్యత

**భద్రాచలం (దక్షిణ భారతదేశం)**

- అరకొర నిధులు, స్థానిక ఆదాయంపై ఆధారపడటం
- పాత బస్ స్టేషన్, సరిపోని వసతి, ఇరుకు రోడ్లు
- కేవలం రాష్ట్ర పండుగలకు మాత్రమే ప్రాధాన్యత

"అయోధ్యలో రామయ్య జన్మించిన భూమి. భద్రాచలంలో రాముడు నడియాడిన భూమి. ఒక్క రాముడికే రెండు చోట్లా రెండు రకాల న్యాయాలా? పక్షపాతం ఎందుకు?" అని భక్తులు నిలదీస్తున్నారు.

**రామయ్యకు పూర్వ వైభవం రావాలంటే...**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే రాజకీయాలను పక్కన పెట్టి, భద్రాచలం అభివృద్ధికి దృష్టి సారించాలని భక్తులు, స్థానికులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

**ప్రత్యేక నిధులు కేటాయింపు:**

అయోధ్య అభివృద్ధికి కేటాయించినంత కాకపోయినా, కనీసం ?1,000 కోట్ల ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీని కేంద్రం ప్రకటించాలి.

**మౌలిక వసతుల కల్పన:**

గోదావరి కరకట్టను వరద ప్రమాదం నుంచి శాశ్వతంగా కాపాడేందుకు బలోపేతం చేయాలి. మెరుగైన రోడ్లు, ఆధునిక వసతి గృహాలు నిర్మించాలి.

**పర్యాటక హబ్:**

భద్రాచలాన్ని తెలంగాణలోని చారిత్రక, ఆధ్యాత్మిక కేంద్రాలను కలుపుతూ 'రామాయణ సర్క్యూట్' లో ఒక ప్రధాన హబ్‌గా అభివృద్ధి చేయాలి.

**పట్టణ అభివృద్ధి**

దేవస్థానం పరిసర పట్టణాన్ని ఆధునీకరించి, భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించాలి.

**ప్రభుత్వాలకు స్పష్టమైన సందేశం:**

భద్రాచలం కేవలం తెలంగాణ ప్రజల ఆస్తి కాదు, ఇది భారతదేశ ఆధ్యాత్మిక వారసత్వం. ఓటు బ్యాంకు రాజకీయాలకు అతీతంగా, రామయ్య క్షేత్రానికి పూర్వ వైభవం తీసుకురావాల్సిన బాధ్యత మీపై ఉంది. ఈ నిర్లక్ష్యాన్ని భక్తులు ఇంకెంతకాలం సహించాలి?

# రాష్ట్రంలో పడకేసిన పల్లె పాలన

**నిధుల లేమి.. కుంటుపడిన అభివృద్ధి**

పంచాయతీ ఖజానా ఖాళీ కావడంతో అభివృద్ధి పనులు పూర్తిగా స్తంభించిపోయాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో గ్రామ పంచాయతీలు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయాయి. గతంలో చేసిన పనులకు బిల్లులు రాక కాంట్రాక్టర్లు కొత్త పనులు చేయడానికి ముందుకు రావడం లేదు. సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. కనీసం మోటార్ల రిపేర్లు, పైపులైన్ల లీకేజీలు సరిచేయడానికి కూడా నిధులు లేక కార్యదర్శులు సతమతమవుతున్నారు.

**అస్తవ్యస్తంగా పంచాయతీల నిర్వహణ**

నిధులు, పర్యవేక్షణ లోపించడంతో గ్రామాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పల్లెలు పారిశుధ్య లోపంతో కొట్టుమిట్టాడుతున్నాయి.

**చెత్త గుట్టలు:**

ఇంటింటికీ చెత్త సేకరణ సరిగా జరగక, వీధుల్లో చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. దీంతో దోమలు పెరిగి విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉంది.

**చీకటిలో వీధులు:**

వీధి దీపాలు మరమ్మతులకు నోచుకోక గ్రామాలు రాత్రివేళ అంధకారంలో మగ్గుతున్నాయి. కొత్త బల్బులు కొనడానికి కూడా పంచాయతీలో డబ్బులు లేని పరిస్థితి.

**తాగునీటి ఇబ్బందులు:**

క్లోరినేషన్, ట్యాంకుల శుభ్రత వంటి కనీస చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు కలుషిత నీటితో అనారోగ్యం పాలవుతున్నారు. ప్రజాస్వామ్యానికి పునాది రాళ్లయిన గ్రామ పంచాయతీలు నేడు నిధులు, విధులు లేక నిర్వీర్యమవుతున్నాయి. ప్రత్యేక పాలన పేరుతో కాలయాపన చేయకుండా, వెంటనే నిధులు విడుదల చేసి, గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. లేదంటే పల్లె ప్రగతి కేవలం కాగితాలకే పరిమితమయ్యే ప్రమాదం ఉంది.

# కెసిఆర్ దొంగదీక్షలతో తెలంగాణ రాలే

హైదరాబాద్,నవంబర్ 28 తెలంగాణ ఉద్యమ సమయంలో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన దీక్ష కారణంగానే తెలంగాణ రాలేదని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా తీసుకున్న నిర్ణయం వల్లనే తెలంగాణ సాకారమయ్యిందన్నారు. అంతేగానీ కెసిఆర్ దొంగ దీక్షలతో కాదని సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారంఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ వల్ల తెలంగాణ రాలేదన్నారు. దీక్ష పేరుతో కేసీఆర్ ఎనిమిది రోజులు ఫ్లూయిడ్స్ తీసుకున్నారని.. దీక్ష పేరుతో కేసీఆర్ నాటకం చేశారని ఆరోపించారు. కేసీఆర్ దీక్ష చేసిన సమయంలో డాక్టర్స్ ఇచ్చిన రిపోర్టులను కేటీఆర్‌కు పంపుతామని పీసీసీ చీఫ్ అన్నారు. కేసీఆర్ దీక్షతో తెలంగాణకు వచ్చింది ఏంటని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో చనిపోయింది ఎస్సీ, ఎస్టీ, బీసీ బిడ్డలని తెలిపారు. కేసీఆర్ దీక్ష విరమిస్తే విద్యార్థులు పోరాటాన్ని కొనసాగించారని అప్పటి సంగతులను గుర్తుచేశారు. విద్యార్థుల ఆవేదన చూసి సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారని తెలిపారు. కిరోసిన్ పోసుకున్న హరీష్ రావుకి అగ్గిపెట్టె దొరకలేదా అని ప్రశ్నించారు. ఫ్లూయిడ్స్ తీసుకుని ఐరోమ్ షర్మిల 16 ఏండ్లు దీక్ష చేశారన్నారు. ఉనికి కోల్పోయిన బీఆర్ఎస్ కోట్లాది రూపాయలతో దీక్షా దివాస్ చేస్తోందని విమర్శించారు. తెలంగాణ కోసం దీక్ష చేసినట్లు కేసీఆర్ నాటకం ఆడారని.. ఇప్పుడు దీక్షా దివాస్ పేరుతో మళ్ళీ సెంటిమెంట్ రగిల్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. దీక్షా దివాస్‌ను పక్కన పెట్టి సోనియా గాంధీకి పాలాభిషేకాలు చేయాలని హితవుపలికారు. తెలంగాణలో కేసీఆర్, ఆయన పార్టీకి నూకలు చెల్లిపోయాయని భావిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ ముగిసిన అధ్యాయమని కేసీఆర్‌కు అర్థమైందని.. అందుకే ఆయన బయటకు రావడం లేదంటూ కామెంట్స్ చేశారు. బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై మహేష్ గౌడ్ స్పందిస్తూ.. బీసీ రిజర్వేషన్ల పెంపుపై కోర్టుకు వెళ్తామన్నారు. ఇంద్రా సహానీ, కృష్ణమూర్తి కేసులను ఛాలెంజ్ చేస్తామని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే అంశం ముగిసిపోలేదని స్పష్టం చేశారు. రిజర్వేషన్ల పెంపు కోసం బీజేపీ అడ్డు పడుతోందని ఆరోపించారు. ఈ విషయంపై బీసీ నాయకులు.. బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల ఇండ్లకు వెళ్ళి ప్రశ్నించాలని కోరారు. పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ల అంశంపై మాట్లాడాలని ఎంపీలకు విన్నవించినట్లు తెలిపారు. హిడ్మా, గణపతి ప్రజాసేవ కోసం త్యాగం చేశాని పీసీసీ చీఫ్ అన్నారు. లొంగిపోదామని వచ్చే మావోయిస్టులకు అవకాశం ఇవ్వాలన్నారు. లొంగిపోదాం అనుకునే మావోయిస్టులు తెలంగాణకు రావచ్చని పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ వాళ్లు మతం పేరుతో విషం నింపుతున్నారని మండిపడ్డారు. మతాల పేరుతో చిచ్చు పెట్టినన్ని రోజులు ఇండియా ముందుకు పోదని పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ వ్యాఖ్యలు చేశారు.

# కామారెడ్డిలో కవిత రైల్వే రోకో

కామారెడ్డి,నవంబర్28(ఆర్ఎన్ఎ): కామారెడ్డిలో తెలంగాణ జాగృతి కార్యకర్తలు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఈక్రమంలో నిరసన చేస్తున్న జాగృతి అధ్యక్షురాలు కవితను పోలీసులు అడ్డుకున్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో శుక్రవారం రైల్‌రోకో నిర్వహించారు.. కవిత పట్టాలపై బైఠాయించి ఆందోళన చేశారు. కార్యకర్తలను పోలీసులు అడ్డుకునే క్రమంలో తోపులాట జరిగి ఆమె చేతికి స్వల్ప గాయమైంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత శుక్రవారంకామారెడ్డిలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డిలో కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో రైలు రోకో నిర్వహించారు. ఆమెతో పాటు తెలంగాణ జాగృతి నాయకులు రైలు పట్టాలపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు కవితను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కవిత డిమాండ్ చేశారు. అనంతరం వారు ట్రాక్‌పై కూర్చొని రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మరోవైపు అప్రమత్తమైన కామారెడ్డి పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బందితో కలిసి జాగృతి నేతలను అక్కడ నుంచి తప్పించే ప్రయత్నం చేస్తుండటంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ తరుణంలో కవితను అరెస్ట్ చేశారు. ఈ పెనుగులాటలో కవిత చేతికి స్వల్ప గాయమైంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు కేవలం 17 శాతం రిజర్వేషన్లతోనే పంచాయతీ ఎన్నికలకు వెళ్లడం దారుణమన్నారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు అమలు కాకుండా కాంగ్రెస్, బీజేపీలు అడ్డుకుంటూ కుట్రలు చేస్తున్నాయని కవిత ఆరోపించారు. ఇకపోతే కాళేశ్వరం ప్రాజెక్టుపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత షాకింగ్ కామెంట్స్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు ఒరిగిందేమీ లేదని విమర్శలు చేశారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూడికతీతను వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేశారు. నిజాంసాగర్ టూరిజం, కౌలాస్ కోట ఓ స్పాట్‌గా ఏర్పాటు చేయాలని సూచించారు. మొంథా తుఫానుతో జిల్లాలో పత్తి రైతులు నష్టపోయారని చెప్పుకొచ్చారు. జుక్కల్ ప్రాంతంలో జిన్నింగ్ మిల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. జిన్నింగ్ మిల్ కోసం జాగృతి పోరాటం చేస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన వారికే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల అనుమతి పేరుతో డబ్బులు తీసుకోవద్దని సూచించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ నియోజకవర్గంలో ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. సర్పంచ్ ఎన్నికల్లో యువత ముందుకు వచ్చి ఆయా సమస్యలపై పార్టీలను ప్రశ్నించాలని సూచించారు. రోడ్ల కోసం ఆందోళన చేస్తుంటే జుక్కల్ ఎమ్మెల్యే యువకుల మీద కేసులు పెట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. యువతపై నమోదైన కేసులను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. 317 జీవోతో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ సర్కార్ వెంటనే ఉద్యోగులను తిరిగి స్వస్థలాలకు పంపించాలని సూచించారు. గొర్రెల కోసం డీడీలు కట్టి చాలా మంది అప్పుల పాలయ్యారని పేర్కొన్నారు. అర్హులకు వెంటనే గొర్రెలు పంపిణీ చేయాలని కోరారు. ఆటోవాళ్లకు వేల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని కవిత డిమాండ్ చేశారు.

# అంతటి బలహీనమైన నాయకుడిని కాదు: జగ్గారెడ్డి

2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైనంత మాత్రాన తాను కుంగిపోయే వ్యక్తిని కాదని, అంత బలహీనమైన నాయకుడిని కాదని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పష్టం చేశారు. రాజకీయాల్లో అన్ని ప్రశ్నలకు ఒకేసారి సమాధానం ఉండదని ఆయన ఈరోజు మీడియాతో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రాహుల్ గాంధీని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ విమర్శించడం సరికాదని ఆయన అన్నారు. లక్ష్మణ్ వయస్సు 69 ఏళ్లని, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు అవుతోందని, అప్పటికింకా లక్ష్మణ్ పుట్టలేదని అన్నారు. అలాంటి లక్ష్మణ్ తమ పార్టీ నాయకుడి గురించి మాట్లాడటం సముచితం కాదని అన్నారు. దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వ్యవసాయాన్ని అభివృద్ధి చేశామని, ఎఫ్‌సీఐని ఏర్పాటు చేశామని, పెత్తందారీ భూములను పేదలకు పంచామని, బ్యాంకులను పల్లెలకు తెచ్చామని, బాలానగర్ బీడీఎల్ వంటి కంపెనీలు తెచ్చామని ఆయన అన్నారు. మోదీ అధికారంలోకి వచ్చి 12 ఏళ్లు అవుతోందని, వారు ఏం కంపెనీలు ప్రారంభించారో చెప్పాలని నిలదీశారు. 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించింది రాజీవ్ గాంధీ అని ఆయన గుర్తు చేశారు. దేశంలో ఐటీ అభివృద్ధికి రాజీవ్ గాంధీ ఆలోచనలే కారణమని అన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఉన్న అభివృద్ధి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఉందా అని ప్రశ్నించారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా బీజేపీ దొంగ ఓట్లతో గెలుస్తూ వస్తోందని విమర్శించారు.

## సంపాదకీయం

# పత్తి రైతులపై నిబంధనల కత్తి !-

శుక్రవారం 28-2025

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో రైతులు చిత్తవుతున్నారు. రైతులు ఆనందంగా తమ పంటలను అమ్ముకున్నా మన్న భరోసాలో లేరు. ధాన్యం ఏదైనా దైన్యంగానే గడుపుతున్నారు. ముఖ్యంగా తెల్లబంగారం పండిస్తున్న రైతులు తెల్లమొహం వేయాల్సి వస్తోంది. పత్తి కొనుగోలులో రైతులకు సిసిఐ నిబంధనలు తీవ్ర ప్రతిబంధకం గా మారాయి. అమెరికా టారిఫ్ యుద్ధం నేపథ్యంలో భారత రైతుల ప్రయోజనాలను ఎట్టిపరిస్థితుల్లో కాపాడి తీరుతానని ప్రకటించిన ప్రధాని నరేంద్ర మోదీ పత్తిపై దిగుమతి సుంకాన్ని 11 శాతం నుంచి సున్నాకు తగ్గించడం రైతుకు చివరి శరాఘాతమైంది. దీని ఫలితంగా అమెరికా, బ్రెజిల్ నుంచి విదేశీ పత్తి వరదలా వచ్చిపడుతుంటే స్వదేశీ పత్తి ధర లేక వెలవెలబోతున్నది. రాష్ట్ర ప్రభుత్వాలు పత్తి కొనుగోళ్ల సమస్యపై పూర్తి అలసత్వం చూపుతున్నాయి. సీసీఐ రెండుసార్లు టెండర్లు పెడితే మిల్లుల యాజమాన్యాలు ఎగ్గొట్టాయి. దాంతో విధిలేక మూడోసారి పిలవాల్సి వచ్చింది. వీటన్నిటి ఫలితంగా సిరులు తెస్తుందనుకున్న తెల్ల బంగారం రైతుల నడ్డి విరుస్తోంది. ఆశలు కోల్పోయిన పత్తి రైతులు పంటలను తగులబెడుతున్నారు. అన్నిరకాలుగా ఆశలు అడుగంటడంతో పత్తి రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేయాల్సి వచ్చింది. ప్రైవేటు వ్యాపారుల మీద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూపే ప్రేమలో లేశమైనా రైతుల మీద చూపితే ఈ పరిస్థితి వచ్చేది కాదు. పత్తి విక్రయానికి అనేక ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఇ-క్రాప్‌లో నమోదు నమోదై ఉండాలి. దీంతోపాటు రైతు సేవా కేంద్రంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ వద్ద పేరు నమోదు చేసుకోవాలి. సిఎం యాప్, కపాస్ కిసాన్ యాప్‌లో పేర్లు నమోదు చేశాక సమీప కొనుగోలు కేంద్రంలో ఉన్న జిన్నింగ్ మిల్లులకు పత్తిని తీసుకొని వెళ్లాలి. ఎనిమిది శాతం నుంచి 12 శాతం తేమ ఉంటే మూడు కేజీలు తరుగు పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. 12 శాతం మించి తేమ ఉంటే కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాప్‌లో స్లాట్ బుకింగ్ నిబంధన, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడం వల్ల పత్తిని అమ్ముకునేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎకరాకు ఏడు క్వింటాళ్లను మాత్రమే కొనాలన్న నిబంధన రైతులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ఎకరాకు గరిష్టంగా 12 నుంచి 15 క్వింటాళ్లు దిగుబడి వచ్చే అవకాశం ఉండగా, మొత్తం దిగుబడిలో సగం కొనుగోలు చేస్తే మిగతా పత్తి ఎక్కడ అమ్ముకోవాలని రైతులు ఆందోళన చెందుతున్నారు. తేమ శాతం ఎనిమిది నుంచి 12 శాతం వరకు ఉన్నా కనీస మద్దతు ధర రూ.8,110 ఇవ్వడం లేదని రైతులు చెబుతున్నారు. అంతే కంటే ఎక్కువగా తేమ శాతం ఉంటే కొనుగోలు చేయడం లేదు. ఆరబెట్టి తీసుకురావాలని అధికారులు తెగేసి చెప్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతోపాటు ప్రస్తుతం మంచు కురుస్తున్నందున 15 నుంచి 18 శాతం వరకు తేమ శాతం ఉన్నా అనుమతించాలని రైతులు కోరుతున్నారు. ఆరబెట్టుకునేందుకు తగిన స్థలం లేదని చెప్తున్నారు. పత్తి కొనుగోలుకు కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేసుకోవాలనే నిబంధనను రద్దు చేయాలని కోరుతున్నారు. ఇలా రైతన్నలను అడుగడుగునా ఇబ్బందులు పెడుతున్నాయి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటనలతో మభ్య పెట్టడం తప్ప క్షేత్రస్థాయి సమస్యలను పట్టించుకోవడం లేదు.. ఏ సాయం అందకపోయినా, సొంతంగా పెట్టుబడి సమకూర్చుకొని, ఆరుగాలం కష్టపడి పంట పండించి అమ్ముదామని మార్కెట్‌కు పోతే కొనేవారు కరువు. దీని ఫలితంగా అన్నదాతలు, మరీ ముఖ్యంగా పత్తి రైతులుచిత్తవుతున్నారు. మద్దతు ధర అస్థిరంగా ఉండటం, ప్రకటించిన ధర కూడా ఇవ్వకపోవడం రైతులపాలిట శాపంగా మారుతున్నది. ఇటు రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి, అటు కేందప్రభుత్వ రైతు వ్యతిరేక వైఖరి కారణంగా పత్తి రైతు పరిస్థితి అగమ్మగోచరంగా తయారయ్యింది. పత్తి కొనుగోలు విషయంలో రైతులకు అండగా నిలవాల్సిన కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీసీఐ అడుగడుగునా కొర్రీలు వేస్తున్నది. గతేడాది మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521 కాగా రైతుకు దక్కింది రూ.5,500 మాత్రమే. అంటే రూ.2,000 కోత కింద పోయింది. ఈ ఏడాది మద్దతు ధర రూ.8,100కు పెంచినట్టు చెప్తున్నప్పటికీ రైతు చేతికి వచ్చేది రూ.6,000 మాత్రమే. సీసీఐ స్వయంగా మద్దతు ధర పూర్తిగా చెల్లించనప్పుడు ప్రైవేటు వ్యాపారి మాత్రం ఎలా చెల్లిస్తాడని రైతులు వాపోతున్నారు. గతంలో పత్తి కొనుగోళ్లలో జరిగిన అవకతవకల నివారణకు సీసీఐ ప్రవేశపెట్టిన నిబంధనలపై జిన్నింగ్ మిల్లులు తీవ్రంగా ప్రతిఘటిస్తుండటంతో పత్తి కొనుగోళ్లకు అడ్డంకులు ఏర్పడ్డాయి. టెండర్ల ప్రక్రియకు బ్రేకులు పడి పత్తి రైతు దిక్కుతోచని పరిస్థితిలో పడ్డాడు. ప్రభుత్వాల నిర్లక్ష్యంతో విలవిలలాడుతున్న పత్తి రైతుకు యాప్ రూపంలో మరో గండం వచ్చిపడింది. కపాస్ కిసాన్ యాప్ ద్వారానే కొనుగోళ్లు జరుపుతామని సీసీఐ షరతు పెట్టింది. చాలామంది రైతుల వద్ద ఇప్పటికీ స్మార్ట్ ఫోన్లు లేవు. పైగా రాష్ట్రమంతటా, ముఖ్యంగా పత్తిరైతులు ఎక్కువగా ఉండే ఆదిలాబాద్ వంటి ప్రాంతాల్లో సరైన మొబైల్ నెట్‌వర్క్ అందుబాటులో లేదు. పంట దిగుబడి సమయంలో, మార్కెట్‌కు తరలించే సమయంలో వర్షాలు, తుఫానులు రావడం తెలిసిందే. తద్వారా తేమశాతం కొంచెం పెరగడమూ సహజమే. ఈ నేపథ్యంలో రైతు పట్ల కనీస సానుభూతితో వ్యవహరించ కుండా కొర్రీలతో చుక్కలు చూపించడం ఏ మాత్రం సమర్ధనీయం కాదు. ఇతర రాష్ట్రాల్లోనూ యాప్ కారణంగా పత్తి రైతులు యాతనలు పడ్డారు. పంజాబ్ రైతులైతే ఈ యాప్ తమకొద్దని తిరస్కరించారు. ఈ క్రమంలో దేశంలో పత్తి మార్కెట్ తీవ్రమైన కుదుపులు ఎదుర్కోవడం కారణంగా పత్తి పండింప రైతులకు శరాఘాతంగా మారింది. దీనిపై కేంద్రం వెంటనే స్పందించి, దేవీయంగా పత్తి రైతులను ప్రోత్సహించాల్సి ఉంది.

# అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలన, మహిళోద్ధరణకు జ్యోతిరావు పూలే కృషి.

## -సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.సామెల్.

అక్షర విజేత, ఇబ్రహీంపట్నం :-

మహాత్మ జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి సందర్భంగా ఇబ్రహీంపట్నం పాషా నరహరి స్మారక కేంద్రంలో ఇబ్రహీంపట్నం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే 135 వ వర్ధంతి నిర్వహించారు. మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.సామెల్, సిపిఎం సీనియర్ నాయకులు ఎ.వెంకటేష్ లు స్థానిక నాయకులతో కలిసి పూలమా లేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోడ సామెల్ మాట్లాడుతూ...వెనుకబడిన బడుగు బలహీన వర్గాల హక్కులు కోసం మహిళలకు విద్యా అవకాశల కోసం కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేసాడు. 1873 సెప్టెంబరు 24న, పులే తన అనుచరులతో కలిసి, దిగువ కులాల ప్రజలకు సమాన హక్కులను పొందటానికి సత్యశోధక్ సమాజ్ (సొసైటీ ఆఫ్ సీకర్స్ ఆఫ్ ట్రూత్) ను ఏర్పాటు చేశాడు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేసిన ఈ సంఘంలో అన్ని మతాలు, కులాల ప్రజలు కూడా చేరవచ్చు. సామాజిక సంస్కరణ ఉద్యమంలో ఫులే ఒక ముఖ్యమైన వ్యక్తిగా పరిగణించబడ్డాడు. అతను, అతని భార్య సావిత్రిబాయి ఫులే భారతదేశంలో మహిళా విద్యకు మార్గదర్శకులు. అతను మహిళలకు, తక్కువ కుల ప్రజలకు విద్యను అందించే ప్రయత్నాలకు ప్రసిద్ధి చెందాడు. ఫులే బాలికల కోసం మొదటి పాఠశాలను 1848లో పూణేలో ప్రారంభించాడు. అతను వితంతువుల కోసం ఒక గృహాన్ని కూడా స్థాపించాడు. భారతదేశ బాలికల కోసం ఒక పాఠశాల ప్రారంభించిన మొట్టమొదటి స్థానిక భారతీయులలో ఈ జంట ఉన్నారు. విద్య యొక్క విశ్వీకరణను సమర్థించిన మొదటి సంస్కర్త కూడా ఆయనే అని



అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.జెగదీశ్, సిపిఎం మండల కార్యదర్శి బుగ్గ రాములు, జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్.జంగయ్య, పి.జెగన్, డి.కిషన్, సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు ఎ.వెంకటేష్, సిహెచ్.ముషాలయ్య, సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు ఎర్పుల వీరేషం,
సిపిఎం పార్టీ మున్సిపల్ కార్యదర్శి చింతపట్ల ఎల్లేశ, గణేష్, నర్సింహా, రమేష్, గిరి, ప్రభాకర్, విజయ్, లింగమయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి జనరల్ స్థానంలో సర్పంచ్ పదవికి బీసీలు పోటీ చేయాలి

అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రాకపోవడం చాలా బాధాకరం ఈ పరిస్థితుల్లో బీసీలకు కేవలం 22% రిజర్వేషన్లు రావడం శోచనీయం అని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ అన్నారు. 50% జనరల్ స్థానాలు కేటాయించబడ్డాయని, 50% జనరల్ స్థానాల్లో ప్రతి బీసీ బిడ్డ పోటీ చేయాలని, ఆ ఊరిలోని బీసీ కులస్తులందరూ ఏకమై ఒకే ఒక బీసీ అభ్యర్థిని జనరల్ స్థానంలో నిలబెట్టుకొని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలి అని నరాల సుధాకర్ అన్నారు. జనరల్ స్థానాల్లో కూడా బీసీలను గెలిపించుకున్నప్పుడు మాధవరెడ్డి లాంటి బీసీ ద్రోహులకు మనం తగిన గుణపాఠం చెప్పినట్టు అవుతది అని రాష్ట్ర కార్యదర్శి ఆకుల ప్రసాద్ అన్నారు. చాలా చోట్ల అగ్రవర్ణాల వారు బహుజనులను తప్పుదోవ పట్టిస్తున్నారని బీసీ రిజర్వేషన్ రాలేదు కాబట్టి బీసీ బిడ్డలైన మీరు పోటీ చేయకండి జనరల్ స్థానంలో మేము పోటీ చేస్తాం మాకు మీరు సపోర్ట్ చేయండి అని బీసీ బిడ్డలను కొందరు అగ్రవర్ణాల వారు తప్పుదోవ పట్టిస్తున్నారని నగర అధ్యక్షులు దర్శనం దేవేందర్ అన్నారు. జనరల్



స్థానం అంటే ప్రతి ఒక్క రు పోటీ చేయవచ్చు కాబట్టి ప్రతి జనరల్ స్థానంలో కనీసం ఒక్క బీసీ బిడ్డ నిలబడి మన బలాన్ని చాటి అత్యధిక మెజార్టీతో బీసీ బిడ్డను జనరల్ స్థానంలో గెలిపించుకుందాం అని జిల్లా ప్రధాన కార్యదర్శి పోల్కం గంగాకిషన్ పిలుపునిచ్చారు. అగ్రవర్ణాలకు డబ్బులకు ఏం కొదవలేదు వారు డబ్బులను విచ్చలవిడిగా ఎగజల్లి ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నం చేస్తారు కానీ ప్రతి బీసీ బిడ్డ డబ్బులకు ఆశపడకుండా మన ఆత్మగౌరవాన్ని చాటాల్సిన అవసరం ఉందని నరాల సుధాకర్ అన్నారు. దాదాపు 60 శాతం ఉన్న మన బీసీలు దేంట్లో తక్కువ కాదని చూపెట్టాల్సిన సమయం ఇది కాబట్టి జనరల్ స్థానాల్లో బీసీలను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ పిలుపునిచ్చారు. నిజామాబాద్ నగరంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన ఈ విలేకరుల సమావేశంలో నరాల సుధాకర్ తో పాటు గంగాకిషన్, ఆకుల ప్రసాద్, దర్శనం దేవేందర్, కొయ్యాడ శంకర్,శ్రీలత, %ఎ%బగ్గలి అజయ్, బసవ సాయి, వాసం జయ తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి : గ్రామ పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని బోధన్ మండలం అమ్మాపూర్ గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. సర్పంచ్, వార్డు స్థానాల ఎన్నిక కోసం జారీ చేసిన నోటిఫికేషన్ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎలాంటి తప్పిదాలు, పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని, అవసరమైన వారికి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నియమ, నిబంధనలకు



అనుగుణంగా విధులు నిర్వహించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ సొంత నిర్ణయాలను అమలు చేయకూడదని అన్నారు. విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి తు.చ తప్పకుండా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వ్యయ పరిమితిని పక్కాగా లెక్కించేలా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు కొత్త బ్యాంకు అకౌంట్ తెరిచి, ఆ అకౌంట్ ద్వారానే ఎన్నికల లావాదేవీలు నిర్వహించాల్సి ఉంటుందని సూచించారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎన్నికల అవసరాల నిమిత్తం కొత్త బ్యాంకు అకౌంట్ కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు ఆయా బ్యాంకులు వెంటనే అకౌంట్ ఓపెన్ చేసేలా చూడాలన్నారు. కలెక్టర్ వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి పర్యటించే హెలీప్యాడ్ సభాస్థలి పరిశీలన..!

## -సర్పంచ్ అభ్యర్థులు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడొద్దు. - :సిద్దిపేట పోలీస్ కమిషనర్ విజయ్ కుమార్

అక్షర విజేత:హుస్నాబాద్

డిసెంబర్ 3 న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హుస్నాబాద్ పర్యటన నేపథ్యంలో హుస్నాబాద్ పట్టణంలోని స్థూపం ఏనె వద్ద సభాస్థలిని, హెలిప్యాడ్ పరిసర ప్రాంతాలను సిద్దిపేట పోలీస్ కమిషనర్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు ఉన్నతాధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు పోలీస్ శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తుందని అన్నారు. ట్రాఫిక్ కు ఎలాంటి అంతరాయం కలగకుండా వాహనాలను ఎక్కడికి అక్కడ నిలిపి ప్రజలను సభాస్థలికి చేర్చే విధంగా కృషి చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగొద్దని ఆయన అధికారులను ఆదేశించారు. అదేవిధంగా స్థానిక సంస్థలను దృష్టిలో ఉంచుకొని గ్రామాలలో సర్పంచ్ పదవులను వేలంపాట వేస్తున్నారని సమాచారం అందుతున్నాయని, అలా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో అందరూ స్వచ్ఛందంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పాల్గొని పోటీ చేసే అర్హత ఉందని అన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, అందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి, ఏసిపి సదానందం, సీఐ కె.శ్రీనివాస్, ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి, వివిధ శాఖల అధికారులు ,కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# బడుగులకు విద్య ప్రధాత జ్యోతిబాపూలే

అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :



సామాజిక విప్లవ కారులు, సంఘ సంస్కర్త,బడుగులకు విద్య ప్రదాత, బీసీల జాతి పిత మహాత్మ జ్యోతిబాపూలే 135వ వర్ధంతి బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరం లోని హనుమాన్ జంక్షన్ విగ్రహాల పార్క్ లో గల మహాత్మ జ్యోతిబా పూలే విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నరాల సుధాకర్ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిబా పూలే కేవలం బడుగు బలహీనవర్గాలకె సేవ చేయలేదని గుర్తు చేశారు. సమాజంలో వెనుకబడిన ప్రతి ఒక్కరి గురించి పోరాడిన గొప్ప నాయకుడు మహాత్మ జ్యోతిబాపూలే అని పేర్కొన్నారు. అగ్రవర్ణాల పేదలకు, వితంతువుల కొరకు, ఎస్సీ, ఎస్టీ, బిసి ఇలా ప్రతి జాతి కొరకు, ప్రతి కులం వారి కొరకు పోరాడిన ఏకైక వ్యక్తి మహాత్మ జ్యోతిబాపూలే అని గుర్తు చేశారు. తన భార్యకు విద్యను నేర్పి తన భార్యను భారత దేశ ప్రథమ ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దిన గొప్ప దార్శనికుడు మహాత్మ జ్యోతిబాపూలే అని అన్నారు. సమాజం బాగుపడాలంటే మహిళా చైతన్యం ముఖ్యమని, మహిళా చైతన్యం విద్యతోనే సాధ్యమని గ్రహించి ఆ విధంగా మహిళలకు విద్యను నేర్పించిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిబాపూలే అని అన్నారు. మహిళలు బాగు పాడితే కుటుంబం బాగు పడుతుందని అని చెప్పి తన భార్య ద్వారా మహిళలకు విద్యను నేర్పిన విద్య ప్రదాత భారతదేశ ముద్దుబిడ్డ మహాత్మ జ్యోతిబాపూలే భారతదేశానికొక గొప్ప వరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో నరాల సుధాకర్, ఆకుల ప్రసాద్,మాడవేడి వినోద్ కుమార్, కొయ్యాడ శంకర్, శ్రీలత, బసవసాయి తదితరులు పాల్గొన్నారు.ద

# స్నేహ సొసైటీలో ఆదినారాయణ రెడ్డి పుట్టినరోజు వేడుకలు



అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి : నగరంలోని మారుతి నగర్ లో గల స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్స్ట్రక్షన్ వారి దివ్యాంగుల పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ అయ్యప్ప సేవ ఆధ్వర్యంలో మారం ఆదినారాయణ రెడ్డి పుట్టినరోజు వేడుకలను మారం యశ్వంత్ రెడ్డి, మల్లేశ్వరి వివాహ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సురాబత్తుని శ్రీనివాసరావు డిస్ట్రిక్ట్ చైర్మన్ ఐ క్యాంప్స్ పాల్గొని ప్రసంగించారు. సేవా కార్యక్రమాలను దివ్యాంగుల కొరకు నిర్వహిస్తున్నామని అందులో భాగంగానే లయన్స్ క్లబ్ సభ్యులైన మారం ఆదినారాయణ రెడ్డి పుట్టినరోజు వేడుకలను దివ్యాంగుల మధ్యలో నిర్వహించుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉంది అన్నారు. స్నేహ సొసైటీ కార్యదర్శి ఎస్. సిద్దయ్య,అందుల ప్రత్యేక పాఠశాల ప్రిన్సిపల్ జ్యోతి, మానసిక వికలాంగుల పాఠశాల ప్రిన్సిపల్ రాజేశ్వరి, లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ అయ్యప్ప సేవ కార్యదర్శి కుమ్మరి పోశెట్టి, దివ్యాంగ బాలలు, సిబ్బంది పాల్గొన్నారు

# రోడ్ల మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

## -పనుల ప్రగతిని పరిశీలించిన కలెక్టర్





అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :

ప్రజలకు రవాణా సదుపాయం మెరుగుపర్చేందుకు వీలుగా చేపడుతున్న రోడ్డు మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న ప్రధాన రహదారులకు మరమ్మతులు జరిపిస్తుండగా, క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న పనులను కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద, బైపాస్ రోడ్డు మార్గంలో, డిచ్పల్లి రైల్వే స్టేషన్ ఎదురుగా ప్రధాన రహదారిపై కొనసాగుతున్న రోడ్ల మరమ్మతు పనులను పరిశీలించారు. త్వరితగతిన పనులను పూర్తి చేయించాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. పనులు నాణ్యతతో చేపట్టేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని, పది కాలాల పాటు ఈ పనులు ప్రజలకు ఉపయుక్తంగా నిలిచేలా మన్నికగా జరిపించాలని సూచించారు. కాగా, నిజామాబాద్ నగరంలో గోల్ హనుమాన్ నుండి పూసలగల్లి కి వెళ్ళే మార్గంలో రోడ్డు మరమ్మతులు చేపట్టాల్సి ఉన్న ప్రాంతాలను సైతం కలెక్టర్ పరిశీలించారు. పనులను ఇంకనూ ప్రారంభించకపోవడం పట్ల ఒకింత అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని, వారం, పది రోజుల అనంతరం తాను మరోమారు క్షేత్రస్థాయి పరిశీలన చేయడంతో పాటు పనుల ప్రగతిని సమీక్షిస్తానని అన్నారు. కలెక్టర్ వెంట ఆర్ అండ్ బీ అధికారి ప్రవీణ్, నగర పాలక సంస్థ సహాయ కమిషనర్ రవీంద్ర సాగర్, ఇనాయత్ తదితరులు ఉన్నారు.

# టీ–పోల్ మొబైల్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

## – కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :

స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటర్ల సౌలభ్యం కోసం అందుబాటులోకి తెచ్చిన టీ–పోల్ మొబైల్ యాప్ ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. టీ–పోల్ యాప్ ద్వారా ఓటర్లు తమ ఓటు ఏ పోలింగ్ కేంద్రం పరిధిలో ఉంది అనే వివరాలను పరిశీలించుకోవడంతో పాటు, ఓటరు స్లిప్ ను డౌన్లోడ్ చేసుకోవచ్చని అన్నారు. అలాగే టి–యాప్ ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన అంశాలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే, వాటిని కూడా తెలియజేయవచ్చని అన్నారు. అభ్యంతరాలు, ఫిర్యాదులు ఎం.పీ.డీ.ఓలకు చేరుతాయని, వాటిని పరిశీలించి తక్షణమే పరిష్కరిస్తారని కలెక్టర్ తెలిపారు. ప్లే స్టోర్ నుండి ఈ యాప్ ను https://play.google.com/store/apps/details?idRcom.cgg.gov.in.te_poll_telugu లింక్ ద్వారా డౌన్ లోడ్ చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు.

# సూర్యాపేటను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలి

## - డ్రగ్ డీ-అడిక్షన్ సెంటర్ ఇంచార్జి మిడతపల్లి గణపతి









అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి : సూర్యాపేట జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా హెూలీ క్రాస్ ఫౌండేషన్ పనిచేస్తుందని డ్రగ్ డీ-అడిక్షన్ సెంటర్ ఇంచార్జి మిడతపల్లి గణపతి అన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా హెూలీ క్రాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐలాపురం గ్రామంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డ్రగ్ డీ-అడిక్షన్ సెంటర్ ఇంచార్జి మిడతపల్లి గణపతి హాజరై మాట్లాడుతూ ప్రజలకు మాదకద్రవ్యాల వల్ల కలిగే భౌతిక, మానసిక, సామాజిక నష్టాలపై అవగాహన కల్పించారు. డ్రగ్స్, మద్యం బారిన పడిన బాధితులకు అండగా తమ సెంటర్ పనిచేస్తుందని అన్నారు. గంజాయి, డ్రగ్స్, మాదకద్రవ్యల వంటి మహమ్మారిని గ్రామాలలోకి రానివ్వకుండా తరిమికొట్టే బాధ్యత ప్రజలందరిపై ఉందని గుర్తు చేసారు. ఈ సందర్భంగా ఐలాపురంలో ఏర్పాటు చేసిన డ్రగ్ డీ-అడిక్షన్ సెంటర్ ద్వారా నిపుణుల పర్యవేక్షణలో ఉచిత వైద్యం, కౌన్సిలింగ్, పునరావాస సేవలు అందిస్తున్నామని తెలిపారు. మత్తుకు బానిసైన వారు భయపడకుండా ముందుకు వచ్చి చికిత్స పొందాలని సూచించారు. ఈ కార్యక్రమం ముగింపులో గ్రామ ప్రజలంతా కలిసి మాదకద్రవ్య రహిత ఐలాపురం గ్రామ నిర్మాణానికి కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, యువత, పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

## -: సి.ఐ సదన్ కుమార్



అక్షర విజేత: చిగురుమామిడి:

చిగురుమామిడి మండలంలోని పీచుపల్లి, చిన్న ముల్కనూర్ గ్రామాల పోలింగ్ కేంద్రాలను తిమ్మాపూర్ సీఐ సదన్ కుమార్ శుక్రవారం సందర్శించారు.రాబోయే ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, భద్రతా పరిస్థితులను ఆయన సమీక్షించారు. అనంతరం గ్రామ ప్రజలకు ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కన్డక్ట్) నిబంధనలను వివరించారు.ఎన్నికల సమయంలో ఎలాంటి చట్టవిరుద్ధ చర్యలు, ప్రలోభాలు, బెదిరింపులు జరిగినా కఠిన చర్యలు తీసుకోవడం తప్పదని సీఐ స్పష్టం చేశారు. ఓటర్లు స్వేచ్ఛగా, భయభ్రాంతులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని భద్రతా చర్యలను పోలీసులు చేపట్టినట్టు తెలిపారు.స్వచ్ఛమైన, శాంతియుత ఎన్నికల కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని గ్రామస్తులను సీఐ కోరారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనకు ఎవ్వరినీ ఉపేక్షించబోమని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో చిగురుమామిడి సబ్ ఇన్ స్పెక్టర్ సాయి కృష్ణ తో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ముసాయిదా విత్తన బిల్లు-2025 పై అభిప్రాయాల సేకరణ

## -ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ వెల్లడి



అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :

వ్యవసాయ శాఖ ద్వారా రూపొందించిన ముసాయిదా విత్తన బిల్లు -2025 పై శుక్రవారం అభిప్రాయ సేకరణ జరిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో వ్యవసాయ అధికారులతో పాటు రైతు ప్రతినిధులు, విత్తన డీలర్లు, కంపెనీలు, విత్తన ఉత్పత్తిదారులతో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ముసాయిదా విత్తన బిల్లులోని అంశాలపై చర్చించి వారి అభిప్రాయాలను సేకరించారు. ముసాయిదా బిల్లులో పొందుపర్చిన నాసిరకం విత్తనాల కారణంగా పంట ఉత్పత్తి, విక్రయ దశలో రైతులకు నష్టం కలిగితే నిర్ణీత కాల పరిమితితో రైతులకు చట్టబద్దంగా నష్ట పరిహారం అందించేలా నిబంధనలపై చర్చించారు. విత్తన ఉత్పత్తి కార్యకలాపాలకు సంబంధించి స్పష్టమైన, సమర్ధవంతమైన నియంత్రణ వ్యవస్థను బిల్లులో చేర్చడం, పత్తి, వరి, పప్పు ధాన్యాలు, మొక్కజొన్న, కూరగాయలు తదితర విత్తనాల ఉత్పత్తి, విక్రయ ధరల నియంత్రణ కోసం నిబంధనలు, విత్తన విక్రయదారుల లైసెన్సింగ్ వ్యవస్థ, మార్గదర్శకాలు, సీడ్ టెస్టింగ్, విత్తనాల దిగుమతి, విత్తన ప్రాసెసింగ్ యూనిట్ల నియంత్రణలో ఉన్న లోపాల సవరణ తదితర అంశాలపై సమావేశంలో కూలంకషంగా చర్చించారు. ముసాయిదా విత్తన బిల్లుపై సేకరించిన అభిప్రాయాలను ప్రభుత్వానికి పంపిస్తామని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం



అక్షర విజేత: హుస్నాబాద్

హుస్నాబాద్ పట్టణంలో మండల బిజెపి రూరల్ అధ్యక్షుడు భూక్య సంపత్ నాయక్ ఆధ్వర్యంలో బిజెపి ఎన్నికల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి బిజెపి జిల్లా మాజీ అధ్యక్షుడు గంగాడి మోహన్ రెడ్డి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రామగోపాల్ రెడ్డి,హుస్నాబాద్ ఎన్నికల ఇన్చార్జి లక్కీరెడ్డి తిరుమల ముఖ్య అతిథిగాహాజరయ్యారు.ఈ సందర్భంగా బిజెపి మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్ రెడ్డి మాట్లాడుతూ రెండు సంవత్సరాలనుండి నుండి గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, కేవలం కేంద్ర ప్రభుత్వం నుండి మూడు వేలకోట్ల నిధుల సమయం అయిపోతుందనే ఉద్దేశముతో ఆట్టి నిధులను రాబట్టడానికి మాత్రమే గ్రామపంచాయతీ ఎన్నికలు ఆగమేఘాలమీద నిర్వహిస్తున్నారని ఆరోపించారు.తెలంగాణలోని గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహించకపోవడంతో గ్రామాలలో అభివృద్ధి పారిశుద్ధ్యం కుంటుబడిందని, ఏనాడు రాష్ట్రప్రభుత్వం గ్రామాలను పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వంచే నిధులు సిద్దిపేట హుస్నాబాద్ హైవే రోడ్డు, గ్రామీణ ప్రాంతాలలో డబుల్ రోడ్లు మంజూరయ్యాయని తెలిపారు. బిజెపి కేంద్రంలో ఏర్పాటయిన నాటి నుండి ఉచితంగా పేద ప్రజలకు బియ్యం అందిస్తుందని, అందులో కేజీకి 35 రూపాయలకు గాను 33 రూపాయలు కేంద్ర ప్రభుత్వం, కేవలం రెండు రూపాయలు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందని తెలియజేశారు. గ్రామాలలో వైకుంఠధామాలు నిర్మించిందని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో బిజెపి పార్టీ అభ్యర్థులను ప్రతి గ్రామంలో, ప్రతి తండాలో ప్రతి గ్రామపంచాయతీ బరిలో నిలుస్తారని, ఏకగ్రీవంగా బిజెపి అభ్యర్థులను ఎన్నుకున్నట్లయితే అ గ్రామానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరి చేయిస్తారని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. గ్రామాలలో బిజెపి సర్పంచ్ అభ్యర్థులను ప్రజలను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో బిజెపి నాయకులు మాజీ మండల అధ్యక్షులు వెల్దండి రాజేంద్రప్రసాద్, వేముల ప్రభాకర్ రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు బొమ్మగాని సతీష్ , మాజీ ఎంపీటీసీ కుంట మల్లయ్య, నాయకులు పూదరి కిష్టయ్య, బైరి అరుణ్, నెల్లి శ్రీనివాస్, ఇటికాల కుమారస్వామి, కొలిపాక కిరణ్, పిట్టల సంతోష్, ప్రశాంత్, సందీప్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# సాదాబైనామా పెండింగ్ అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

## - కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి






అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :

భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలను, సాదాబైనామా పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సబ్ కలెక్టర్లు, ఆర్డీఓ, తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. భూభారతి దరఖాస్తుల పరిష్కారంలో ఆయా మండలాల వారీగా సాధించిన ప్రగతిని పరిశీలించారు. సాదాబైనామా పెండింగ్ దరఖాస్తుల సత్వర పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, అర్జీలను తిరస్కరించినట్లైతే అందుకు గల కారణాలను స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. చిన్నచిన్న కారణాలతో అర్జీలను తిరస్కరించకూడదని, అర్హులైన వారికి యాజమాన్య హక్కులు కల్పించాలనే ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా పని చేయాలని హితవు పలికారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.?



# ఎన్నికల సందర్బంగా ర్యాలీలకు అనుమతి తప్పనిసరి

## -డి.జే లు పూర్తిగా నిషేధం

## - పోలీస్ కమీషనర్ సాయిచైతన్య

అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :

నిజామాబాద్ జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ఎవరైనా ర్యాలీ లు నిర్వహించాలనుకుంటే సంబంధించిన రిటర్నింగ్ అధికారి, పోలీస్ అధికారుల అనుమతి తప్పనిసరిగా ఉండాలని పోలీసు కమిషనర్ సాయిచైతన్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహించడం చట్టపరమైన చర్యలకు కారణమవుతుందని, కాబట్టి ప్రతి రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, నిర్వహకులు నియమాలను పాటించి, ఎన్నికల ప్రక్రియ సవ్యంగా సాగేందుకు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.అదే విధంగా నిజామాబాద్ జిల్లా లో డి.జే లు వాడకం పూర్తిగా నిషేదమని అన్నారు. శాంతి భద్రతలు, ప్రజాస్వామ్య వ్యవస్థ రక్షణలో అందరి భాగస్వామ్యం అత్యంత కీలకమని సీపీ సాయి చైతన్య తెలిపారు.



# పర్యావరణాన్ని పరిరక్షించాలంటే ప్లాస్టిక్‌ను నిషేధించాలి

అక్షర విజేత: హుస్నాబాద్

హుస్నాబాద్ శ్రీ సరస్వతీ శిశుమందిర్ లో పర్యావరణ పరిరక్షణ లో భాగంగా పర్యావరణం కాపాడుట గోడపత్రికను పాఠశాల ప్రబంధకారిని సభ్యులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెత్తను కాల్చకూడదు అనే విషయాన్ని పాఠశాల విద్యార్థులకు వివరించారు .అలాగే చెత్త ను తడి చెత్త ,పొడిచెత్తగా వేరు చేయాలని తెలిపారు. ప్లాస్టిక్ ను నిషేదించాలని విద్యార్థిని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. పర్యావరణాన్ని కలుషితం చేయకూడదని వివరించారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గౌరిశెట్టి ప్రకాష్,కార్యదర్శి బబ్బుల రవీందర్,సహాయ కార్యదర్శి పోల్సాని బాపురావు, పాఠశాల హెచ్ఎం శ్రీలత, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

# స్వతంత్ర అభ్యర్థికె పట్టం కడతాం

## - భావనందాపూర్ గ్రామస్తులు



అక్షర విజేత గజ్వేల్:

సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం భవనందాపూర్ గ్రామ సర్పంచ్ స్వతంత్ర అభ్యర్థిగా నరిగే సత్తమ్మ మర్కుక్ క్లస్టర్ లో నామినేషన్ దాకాలు సంబంధిత అధికారులకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో భవనందాపూర్ గ్రామ ప్రజలు స్వతంత్ర అభ్యర్థికే మా ఓటు అంటూ బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా నరిగే సత్తమ్మ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి, శుద్ధి నీరు, రహదారులు, డ్రైనేజ్ వంటి ప్రాథమిక వసతుల మెరుగుదలకు ప్రాధాన్యతనిస్తానని తెలిపారు. ప్రజల నమ్మకానికి తగిన విధంగా సేవ చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# రోడ్డుపై గుంతలు పూడ్చిన ట్రాఫిక్ పోలీసులు






అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి : నగరంలోని అర్సపల్లి రైల్వే గేట్ దగ్గర రోడ్ పైన పెద్ద పెద్ద గుంటలు ఏర్పడి ప్రజలకి తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతుండడంతో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు మరమ్మతు పనులను శుక్రవారం నిర్వహించారు. తరుచుగా ట్రాఫిక్ జాం అవుతున్న నేపథ్యంలో ఏ ఆర్ ఎస్ ఐ కోటేశ్వరరావు, ట్రాఫిక్ కానిస్టేబుల్ పవన్ కుమార్ మొరం వేయించి రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టి గుంతలను పూడ్చారు. ప్రస్తుతం రాకపోకలు సజావుగా సాగుతున్నాయని అన్నారు. రోడ్డు మరమ్మత్తు చేయించిన ట్రాఫిక్ సిబ్బందిని ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ అభినందించారు.

# పూలే ఆశయ సాధన కోసం కృషిచేద్దాం...

అక్షర విజేత:చిగురుమామిడి
చిగురుమామిడి మండలంలోని ఉల్లంపల్లి గ్రామంలో బీసీ సంక్షేమ సంఘం గ్రామ శాఖ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా పూలే 135వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పూలే దంపతుల విగ్రహాలకు పూల మాలలు సమర్పించి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమానికి మాజీ జెడ్పి ఫ్లోర్ లీడర్,రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు గీకురు రవీందర్ ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా గీకురు రవీందర్ మాట్లాడుతూ దేశములో మొట్టమొదటి సామాజిక తత్వవేత్త, సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిబా పూలే ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపు నిచ్చారు. భారతదేశంలోని శూద్రాతి శూద్రులు, దళిత బహుజన, ఆదివాసీ గిరిజన, ముస్లిం మైనార్టీలు బ్రాహ్మణీయ కుల వ్యవస్థలో కుల వివక్షకుగురవుతు బానిసలుగా ఉన్నారనీ గ్రహించాడు. కుల వివక్షతపై పోరాడాలని, బడుగు బలహీన వర్గాల్లో జ్ఞాన సంపద నింపి సామాజిక చైతన్యులను చేయాలని నిశ్చయించుకున్నాడు. సమాజములో సగ భాగంగా ఉన్న స్త్రీలు అభివృద్ధి చెందకపోతే సమాజం అభివృద్ధి చెందదని పూలే భావించాడన్నారు. స్త్రీలు విద్యావంతులు కావాడానికి ముందుగా తన భార్య సావిత్రిని పాఠశాలకు పంపి ఆమె ద్వారా మహిళలకు విద్యాభ్యాసం ప్రారంభించారు. తన ఆశయ సాధనలో ఎన్ని అవమానాలు, అవరోధాలు ఎదురైనా గానీ వెనుకడుగు వేయలేదన్నారు. బ్రహ్మనీయ కుల వ్యవస్థలో దోపిడీకి, అణిచి వేతకు, కుల వివక్షతకు గురవుతున్న బడుగుల బ్రతుకుల్లో వెలుగు నింపుటకు తన జీవితాన్ని, కుటుంబాన్ని త్యాగం చేసిన త్యాగశీలి యని కొనియాడారు. ప్రస్తుతం దేశములో ఉన్న సామాజిక, ఆర్థిక అసమానతలను తొలిగించి సమాజంలో అందరు స్వేచ్ఛ, సమానత్వం పొందుటకు మహాత్ముని ఆదర్శాలను అనుసరించాలన్నారు. ఈ కార్యక్రమంలో



బీసీ సంక్షేమ సంఘం గ్రామ శాఖ అద్యక్షుడు సుదగొని రాజు గౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్ర శ్రీనివాస్, కానవేని శివకుమార్, బుర్ర సంపత్, సుదగొని రామచంద్రం, బెజ్జంకి అంజయ్య, చీమర్తి నర్సయ్య, పత్తెము సమ్మయ్య, నాంపెల్లి తిరుపతి, సుదగోని వీరాస్వామీ, బుర్ర శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థులకు ప్రజల మద్దతు

-అది చూసి ఓర్వలేక ప్రశాంత్ రెడ్డి అబద్ధపు మాటలు

-రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి



అక్షర విజేత, నిజామాబాద్ ప్రతినిధి :
పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు ప్రజల మద్దతు చూసి ఓర్వలేక ప్రశాంత్ రెడ్డి అబద్ధపు మాటలు మాట్లాడుతున్నారని రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి అన్నారు. రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి భీమ్గల్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు మొదలైనప్పటి నుండి స్థానిక శాసనసభ్యులు ప్రశాంత్ రెడ్డి తమకు గ్రామాల్లో పోటీ చేయడానికి అభ్యర్థులు లేకపోవడంతో ప్రజల్లో కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణ చూసి ఏం చేయాలో తెలియని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం పై అబద్ధపు మాటలు మాట్లాడుతున్నాడని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చీరల పంపిణీ, వడ్డీ లేని రుణాలు ఇస్తున్న సందర్భంలో ఇప్పటికే అయోమయంలో ఉన్న ప్రశాంత్ రెడ్డి అవి కేవలం ఎన్నికల కోసమే ఇస్తున్నారని అబద్ధపు మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. గతంలో మంత్రిగా చేసిన ప్రశాంత్ రెడ్డికి ఏమి చేయాలో తెలియని స్థితిలో ఉన్నాడని అన్నారు. గతంలో 9 సంవత్సరాలు అధికారంలో ఉన్న టిఆర్ఎస్ పార్టీ ఏ రోజు కూడా డ్వాక్రా మహిళలకు ఇచ్చిన రుణాలకు వడ్డీ మాఫీ చేయలేదని, మాఫీ చేయాలనే ఆలోచన కూడా వారికి రాలేదని అన్నారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి కోటి మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇస్తుంటే కేవలం ఎన్నికల కోసమే ఇస్తున్నారని తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. గత మూడు నెలల క్రితం కూడా వడ్డీ లేని రుణాలు ఇవ్వడం జరిగిందని అప్పుడు ఎన్నికలు లేవని,మేము ఎప్పుడు ఇస్తున్నాము కాదు మీరు 9 సంవత్సరాల లో ఎందుకు రుణాలు మాఫీ చేయలేదు ఒక్కసారి ఆత్మ శుద్ధి చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భీంగల్ నగర కాంగ్రెస్ అధ్యక్షులు జేజేనర్సయ్య, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కుంట రమేష్, గోపాల్ నాయక్, అన్వేష్, వక మహేష్, దొంకంటి రాజేష్, నాగభూషణం, శ్యామ్ రాజ్, సాయి బాబా, నవీన్, పల్లికొండ అశోక్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు

## రాజ్యాంగ ఆమోద దినోత్సవ సందర్భంగా పేటేరు జడ్పీ స్కూల్లో అధికారులు విద్యార్థిని విద్యార్థులు రాజ్యాంగ ఆమోద ప్రతిజ్ఞ

రేపల్లె
75 వ రాజ్యాంగ ఆమోద దినోత్సవం రేపల్లె మండలం పేటేరు జడ్పీ హైస్కూల్లో ఘనంగా విద్యార్థిని విద్యార్థులు అధికారులు ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు ఘనంగా ఆమోద దినోత్సవం నిర్వహించారు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం విద్యార్థిని విద్యార్థులు అధికారులు ఉపాధ్యాయులు గ్రామంలో ర్యాలీ నిర్వహించి అనంతరం రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో రేపల్లె డివిజనల్ అభివృద్ధి అధికారి ఏ పద్మ.. ఎంపీడీవో రవిబాబు గ్రామ సర్పంచ్ కె వసుమతి జడ్పీ హైస్కూల్ హెచ్ఎం బాపూజీ రావు . ఉప మండల పరిషత్ అధికారులు పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది అంగన్వాడి సిబ్బంది పేరెంట్స్ కమిటీ సభ్యులు హైస్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు..





## బీఆర్ఎస్ పార్టీ మండల స్థానిక సంస్థల సన్నాహక సమావేశం.

అక్షర విజేత, ఇబ్రహీంపట్నం :-
రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని మంచాల మండల కేంద్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంతో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి నాయకులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతీ నాయకుడు కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ సిద్ధాంతాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరే విధంగా సమన్వయంతో ముందుకు సాగాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్, మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి) పాల్గొని నాయకులతో ముఖ్య సూచనలు పంచుకున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయాన్ని సాధించే దిశగా చేపట్టవలసిన కార్యక్రమాలపై నాయకులతో చర్చించారు. సమావేశంలో మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత మాజీ జడ్పిటిసి సభ్యుడు లోకం మోషే మృతి.



రేపల్లె
నగరం మండలం మాజీ జడ్పిటిసి సభ్యుడు తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత లోకం మోషే (70) శుక్రవారం ఉదయం మృతి చెందారు. వీరికి భార్య కుమారుడు కుమార్తె ఉన్నారు. అంత్యక్రియలు శుక్రవారం మధ్యాహ్నం జరగనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు దాదాపు పది సంవత్సరాల కు పైగా నగరం మండలం ఆంధ్రభూమి రిపోర్టర్ గా మోషే పత్రికా రంగంలో సేవలు అందించారు రాష్ట్ర జిల్లా కమిటీలో సభ్యుడిగా పనిచేశారు ఈ సందర్భంగా రేపల్లె తాలూకా ప్రెస్ క్లబ్ ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంట్ ఆర్ శ్రీనివాసరావు అధ్యక్షులు వాగోలు బాబురావు ప్రధాన కార్యదర్శి ఆలమోషే ఇతర కార్యవర్గ సభ్యులు మీడియా మిత్రులు మోషే మృతికి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలిపారు . పలువురు టిడిపి నాయకులు మోషే మృతికి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలిపారు..

## మతిస్థిమితం లేని బాలుడు పోలీసులకు లభ్యం.



అక్షర విజేత, ఇబ్రహీంపట్నం :-
యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని గురువారం ఉదయం అందాజ 8 గంటల సమయంలో తక్కళ్ళపల్లి గెట్ దగ్గర మెయిన్ రోడ్డు దగ్గర ఒక గుర్తు తెలియని మతిస్థిమితం సరిగ్గా లేని, బాబు వయస్సు అందాజ 12-14 సంవత్సరాలు కలవు. అతడు తన పేరు, వివరాలు చెప్పటం లేదు. తన ఒంటి పైన లైట్ బ్లూ కలర్ టీ షర్ట్, తెలుపు రంగు ప్యాంటు, నిక్ చెప్పులు కలవు. అతని యొక్క కుటుంబ సభ్యుల యొక్క వివరాలు తెలియక పోవడంతో అట్టి మతి స్థిమితం లేని బాబుని సికింద్రాబాద్ లోని "మేరీ హెూమ్స్ ఫర్ ది డిశబ్లెడ్" లో సేఫ్ కస్టడీ కోసం చేర్పించినాము. ఎవరికైనా అట్టి బాలునికి సంబంతితుల వివరాలు తెలిస్తే యాచారం పోలీస్ స్టేషన్ నెంబర్. 8712662657 కి తెలియ పర్చగలరు అని పోలీసులు తెలిపారు.

## మర్కూక్ సర్పంచ్ అభ్యర్థిగా బుల్లె రాణి మల్లేశం నామినేషన్ దాఖలు



అక్షర విజేత గజ్వేల్:
సిద్దిపేట జిల్లా మర్కూక్ మండల గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన బుల్లె రాణి మల్లేశం శుక్రవారం రోజు బిఆర్ఎస్ పార్టీ నాయకులతో,కార్యకర్తలతో గ్రామ ప్రజలతో పెద్ద ఎత్తున బయలు దేరి మర్కూక్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎన్నికల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కర్ణాకర్ రెడ్డి,మాజీ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్,సుధాకర్ రెడ్డి,మోర్సు కరుణాకర్ రెడ్డి,బబ్బురి శ్రీనివాస్ గౌడ్,సంతోష్ రెడ్డి,ప్రవీణ్ చారి,సాయిని మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించిన మెదక్ ఆర్డిఓ రమాదేవి

### -పదిహేడు మంది సర్పంచ్ లు నామినేషన్ స్వీకరణ





అక్షరవిజేత, పెద్ద శంకరంపేట్:
పంచాయతీ ఎన్నికల సందర్భంగా నామినేషన్ కేంద్రాన్ని సందర్శించిన మెదక్ ఆర్ డి ఓ రమాదేవి ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ ప్రక్రియను పరిశీలించి దరఖాస్తు దారులకు సంబంధిత కుల ధ్రువీకరణ పత్రాల కోసం ఇబ్బంది పడకుండా ఉండాలని ఆర్ డి ఓ రమాదేవి ఎమ్మార్వో కి చేపారు. రెండోవ రోజు పెద్ద శంకరంపేట మండలంలో సాయంత్రం వరకు 17 మంది సర్పంచ్ స్థానాలకు వార్డ్ మెంబర్ 40 స్థానాలకు అభ్యర్థులు నామినేషన్లు దరఖాస్తు చేసినట్లు పేట ఎంపీడీవో షాకీర్ అలీ తెలిపారు.. మండల కేంద్రమైన పెద్ద శంకరంపేట్, ఉత్తులూరు. మల్కాపూర్, బూరుగుపల్లి, గ్రామాలకు రెండు చొప్పున దరఖాస్తులు వచ్చాయి, జి వెంకటాపూర్, విరోజ్ పల్లి, మక్తా లక్ష్మపూర్, జమ్లనాయక్ తండా, కె వెంకటాపూర్, కొత్తపేట, రామోజీపల్లి, చిలపల్లి, గొట్టిముక్కుల, సర్పంచ్ స్థానానికి ఒక్కొక దరఖాస్తు చొప్పున నామినేషన్ వచ్చాయని ఆయన వివరించారు.. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాస్, ఆరే రమేష్, ఎం పీ ఓ క్రాంతి కుమార్, ఈఓ ఆశాజ్ జాకీర్ హుస్సేన్ ఎన్నికల అధికారులు తదితరులు ఉన్నారు..

## ప్రతి గ్రామంలో కాంగ్రెస్ జండా ఎగరాలి

### - సర్పంచ్, వార్డు మెంబర్లు అన్ని స్థానాలు మనమే కావాలి

### - కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ

అక్షరవిజేత, సిద్దిపేట:
నియోజకవర్గంలో ఉన్న సర్పంచ్ స్థానాలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు గెలవాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ అన్నారు.శుక్రవారం పట్టణంలోని క్యాంప్ ఆఫీసులో నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల గ్రామాల పార్టీ శాఖ అధ్యక్షులతో తో స్థానిక సంస్థల ఎన్నికలపై సమావేశం నిర్వహించి వారికి పలు సూచనలను చేశారు ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ సిద్దిపేట నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులే సర్పంచులుగా గెలవాలని ఒక వార్డును సైతం వదలకుండా అన్ని వార్డులలో మనవాళ్లే గెలుపు పొందాలని అందుకు మండల శాఖ గ్రామ శాఖ అధ్యక్షులు కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని గడపగడపకు తీసుకువెళ్లాలని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఉచిత కరెంటు 500 కే గ్యాస్ సిలిండర్ సన్న బియ్యం పంపిణీ ఇందిరమ్మ ఇండ్లు లాంటి అనేక పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్,జిల్లా మహిళా అధ్యక్షులు ముద్దం లక్ష్మి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు కాలీముద్దీన్ అహ్మద్, బొమ్మల యాదగిరి,దాస అంజన్న,వివిధ మండలాల అధ్యక్షులు బిక్షపతి,మీసం మహేందర్ యాదవ్, బర్మా రాజ మల్లయ్య, అంజిరెడ్డి, రాములు,యూత్ కాంగ్రెస్ నాయకులు వాహబ్,మేరుగు రాజు,మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



# గజ్వేల్ ఐఓసీ ఎడ్యుకేషనల్ హబ్ పక్కనే వైన్‌షాప్..

## విద్యార్థుల్లో ఆందోళన.. -హ్యూమన్ రైట్స్ కమిషన్‌కు ఫిర్యాదు..

అక్షర విజేత గజ్వేల్

గజ్వేల్ ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ ఉమెన్స్ ఎడ్యుకేషనల్ హబ్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న వైన్‌షాప్‌పై స్థానికులు,విద్యార్థులు తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతుంది.రోజూ దాదాపు 2వేల మంది విద్యార్థులు,మహిళలు నిత్యం రాకపోకలు సాగించే ఈ ప్రాంతంలో మద్యం దుకాణం పెట్టడం పూర్తిగా అనుచితమని ప్రజలు మండిపడుతున్నారు.విద్యాసంస్థలు,హాస్టళ్లు,కాలనీలతో నిండిన ప్రదేశంలో వైన్‌షాప్‌ను ఏర్పాటు చేయడం వల్ల బహిరంగ మద్యం సేవించడం,అశ్లీల ప్రవర్తన,గొడవలు,రాత్రి వేళల్లో భయానక వాతావరణం ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యపై ఇప్పటికే ఎక్సైజ్ అధికారులకు,గజ్వేల్ మున్సిపల్ కమిషనర్ కు,పోలీస్ శాఖకు,ఆర్డిఓకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు వాపోతున్నారు.ప్రభుత్వానికి చెందిన విద్యా సంస్థలు ఉన్న ప్రాంతంలో ఇలాంటి అనధికారిక అనుమతులు ఎలా జారీ అయ్యాయో పరిశీలించాలని డిమాండ్ చేశారు.ఈ నేపథ్యంలో స్థానికుల తరపున 19వ వార్డు ప్రజలు తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ను ఆశ్రయించి వైన్‌షాప్‌ను వెంటనే తొలగించాలనీ,విద్యార్థినులుమహిళల భద్రత కోసం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. హ్యూమన్ రైట్స్ కమిషన్ ఈ ఫిర్యాదును నమోదు చేసి విచారణ ప్రారంభించినట్లు సమాచారం.



# వీరేపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులకు బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం.

## -సి డి పి ఓ, డి. మాధవిలత, సూపర్వైజర్ కె.రమాదేవి

ఉలవపాడు, అక్షర విజేత,, నవంబర్ :-28



ఉలవపాడు మండల, వీరేపల్లి గ్రామం. మోడల్ హై స్కూల్ నందు విద్యార్థులకు బాల్య వివాహాలు పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిడిపివో మాట్లాడుతూ బాల్య వివాహాలు, మరియు మంచి స్పర్శ, చెడు స్పర్శ. వివాహానికి కనీసం 18 సంవత్సరాలు నిండి ఉండాలి. డిగ్రీ చదువు పూర్తి అయి ఉండాలని సిడిపిఓ గారుసిడిపిఓ వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిడిపిఓ మాధవి లత, సూపర్వైజర్,కె. రమాదేవి, హెడ్ మాస్టర్, టీచర్స్, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# వరప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు

గుడ్లూరు, అక్షర విజేత,

గుడ్లూరు మండలం ఏలూరుపాడు గ్రామానికి చెందిన నల్లవుల వరప్రసాద్ ఫిర్యాదు మేరకు గుడ్లూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేయడమైనది.ఫిర్యాదుదారుడు తెలిపిన ప్రకారం, అదే గ్రామానికి చెందిన నిఖితల రమాదేవి మరియు ఆమె కూతురికి దేవుని శంకరయ్య మరియు ఆయన కుమారుడు శివాజీ వద్ద నుండి 20 ఎకరాల భూమి కొనుగోలు నిమిత్తం రూ.73,50,000/- ఇచ్చినట్లు, అయితే రమాదేవి తన కూతురు పేరుతో అగ్రిమెంట్ రాయించుకొని కొంత భూభాగాన్ని మాత్రమే రిజిస్టర్ చేయించుకుని, మిగిలిన భూమికి సంబంధించిన పరిహారం మొత్తాన్ని ప్రభుత్వం నుండి పొందినప్పటికీ, ఆ మొత్తాన్ని వరప్రసాద్‌కు ఇవ్వకుండా వంచనకు పాల్పడినట్లు తెలియజేశాడు.అదేవిధంగా ఫిర్యాదుదారును చంపుతానని బెదిరించినట్లు కూడా ఫిర్యాదులో పేర్కొన్నాడు.పై ఫిర్యాదు ఆధారంగా గుడ్లూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటరావు తెలిపారు.

# బిజెపి బలపరుస్తున్న అభ్యర్థులను గెలిపించండి

## -బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి

అక్షర విజేత, చొప్పదండి

గ్రామపంచాయతీ ఎన్నికల్లో బీజేపీ బలపరుస్తున్న అభ్యర్థులను సర్పంచ్ లు గా, వార్డు సభ్యులుగా ఎన్నుకొని గ్రామాభివృద్ధికి బాటలు వేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడీ కృష్ణారెడ్డి విజ్ఞప్తి చేశారు.చొప్పదండి లో బిజెపి పార్టీ అధ్యక్షులు మొగిలి మహేష్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు బిజెపి ముఖ్య నాయకులతో గంగడి కృష్ణారెడ్డి చొప్పదండిలో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ

గ్రామ పంచాయతీలకు కనీ విని ఎరుగని రీతిలో 2014 నుంచి మోడీ సర్కార్ ఇబ్బడి ముబ్బడిగా నిధులు ఇస్తుందని అంతేకాక ప్రతి గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయం, స్మశాన వాటికలు, రైతు వేదికలు, క్రీడా ప్రాంగణాలు, ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలు, కేంద్ర ప్రభుత్వ నిధులతో మంజూరయ్యాయని, వీధిలైట్ల నుంచి సిసి రోడ్ల వరకు పశువుల టీకాలు నుంచి కోవిడ్ టీకాల వరకు మోడీ ప్రభుత్వమే ఇస్తున్నదని

కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ ప్రతి గ్రామానికి ఉపాధి హామీ నిధులనుంచి సీసీ రోడ్లు డ్రైనేజీలను మంజూరు ఇప్పించారని, పదవ తరగతి విద్యార్థులకు సైకిల్ పరీక్ష ఫీజులు ఇప్పటికే చెల్లించారని, చొప్పదండి నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పరికరాలు సి ఎస్ ఆర్ నిధులనుంచి అందించారని గుర్తు చేశారు.

స్థానిక సర్పంచ్ గా బిజెపి నాయకులు ఉంటే

పార్లమెంట్ సభ్యులతో అనుసంధానంగా ఉండి గ్రామ ప్రజలకు మరిన్ని నిధులతో సేవలు అందించగలరని కావున ప్రజలు భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థులకు మద్దతు ఇచ్చి సర్పంచులు వార్డు సభ్యులుగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లు బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ, బిజెపి కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి, కరీంనగర్ ఒకటో డివిజన్ కార్పొరేటర్



మండల ఇన్చార్జి కొలగాని శ్రీనివాస్

ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు మొగిలి మహేష్ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి భక్తుల లక్ష్మీనారాయణ

చొప్పదండి మండల ఇంచార్జ్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ మాజీ మండల అధ్యక్షులు

మొగిలి సారయ్య, భూమిరెడ్డి,

కిట్టు గౌడ్, నాయకులు జగన్మోహన్ రెడ్డి,రాపెల్లి శ్రీనివాస్, మంచి కట్ల మల్లేష్, కాయిత సాయి రాజేందర్, జొంగోని తిరుపతి గౌడ్ ,జక్కుల అంజయ్య, శంకర్ ,

దయ్యాల శేఖర్ చీకట్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

# శ్రీ గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ కళాశాలలో నేడే కందుకూరులో జాబ్ మేళా

### 910 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

### 18-45 సంవత్సరాల మధ్య యువతకు అవకాశం

### సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, అక్షర విజేత,




వెనుకబడ్డ కందుకూరు ప్రాంత నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా, కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు మరొకసారి కందుకూరులో జాబ్ మేళా నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (APSSDC) ఆధ్వర్యంలో, ఈనెల 29వ తేదీ శనివారం కందుకూరు పట్టణంలోని శ్రీ గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ జాబ్ మేళా జరగనుంది. నిరుద్యోగ యువతీ యువకులు ఉదయం 9 గంటల నుంచి ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చు. జాబ్ మేళాలో పాల్గొనదలచినవారు naipunyam.ap.gov.in పోర్టల్ లో రిజిస్టర్ చేసుకుని, అలాట్మెంట్ లెటర్ తో ఇంటర్వ్యూలకు హాజరు కావాల్సి ఉంటుంది. ఇతర వివరాలకు 7286822789, 6301543185 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ కందుకూరు నియోజకవర్గం లోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు వారు తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవచ్చని తెలిపారు. మొత్తం 15కు పైగా కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొంటాయని, 910 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారని ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలియజేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తుందని ఆయన చెప్పారు. ప్రతి రెండు మూడు నెలలకు ఒకసారి కందుకూరు నియోజకవర్గంలో ఇలాంటి జాబ్ మేళాలు నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే నాగేశ్వరరావు చెప్పారు.

# ప్రకాశంలో రహదారి భద్రతపై ప్రత్యేక అవగాహన

కందుకూరు, అక్షర విజేత,:

జాతీయ రహదారి భద్రతమహోత్సవాల%-%2025లో భాగంగా ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజీలో ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా శాఖ అధికారులు నిర్వహించిన రహదారి భద్రత అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది, కాలేజీ బస్సుల డ్రైవర్లకు ట్రాఫిక్ నియమాలు భద్రతపై శుక్రవారం విశదీకరణ అందించారు. "రహదారి భద్రత %-% మన అందరి బాధ్యత" అనే అంశంతో జరిగిన కార్యక్రమానికి ఆర్‌టీఓ టి.వి.ఎన్. నాగలక్ష్మి , మోటార్ వాహన ఇన్స్పెక్టర్ జె. అనిల్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఆర్‌టీఓ నాగలక్ష్మి హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం, మొబైల్‌తో డ్రైవింగ్ నిషేధం, 18 ఏళ్లు పూర్తయ్యాకే వాహనం నడపాలన్న చట్టం వంటి కీలక అంశాలను విద్యార్థులకు వివరించారు. ప్రమాదంలో గాయపడిన వారికి సహాయం చేయడం పౌర ధర్మమని, వారికి సహాయం చేసే వారికి పోలీసు శాఖ ప్రత్యేకంగా అభినందనలు అందించే విధానాన్ని ఆమె వివరించారు.

కార్యక్రమంలో భాగంగా కాలేజీ బస్సుల డ్రైవర్లకు ప్రత్యేక మార్గదర్శకాలనుఅందించారు. మద్యం సేవించి వాహనం నడపడం కఠినంగా నిషేధించబడిందని, బ్యాక్-టు-బ్యాక్ ట్రిప్స్‌లో విశ్రాంతి తీసుకోవడం తప్పనిసరి అని సూచించారు.



బస్సులో ఉన్న ప్రతి విద్యార్థి ప్రాణ భద్రత డ్రైవర్ బాధ్యత అని గుర్తు చేశారు. సమయానికి వాహనం తనిఖీలు చేయడం, అత్యవసర పరికరాల నిర్వహణ, రోడ్డు నియమాల పాటింపు విద్యార్థుల భద్రతను క్రమం పరిశీలించాలన్నారు. మద్యం సేవనంపై 'జీరో టాలరెన్స్ పాలసీ'ను అధికారులు స్పష్టంగా తెలియజేశారు.ఎంవీఐ అనిల్ కుమార్ రోడ్డు ప్రమాదాల గణాంకాలు, అధిక వేగం కారణంగా యువతలో పెరుగుతున్న ప్రమాదాలు, డ్రైవింగ్‌లో జాగ్రత్తల ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రైవింగ్ చేసే ప్రతి నిర్ణయం ప్రాణానికి సంబంధించి ఉంటుందని, వేగ నియంత్రణ, రోడ్ సిగ్నల్స్ పాటించడం, అత్యవసర పరిస్థితుల్లో స్పందన వంటి అంశాలపై సూచనలు అందించారు. "వాహనం నడపడం ఒక నైపుణ్యం మాత్రమే కాదు, ప్రాణ భద్రతకు బాధ్యత" అని ఆయన అన్నారు.ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపల్ డా. చదలవాడ రవికుమార్ మాట్లాడుతూ రహదారి భద్రతపై ఆర్‌టీఏ అందించిన మార్గదర్శకాలు విద్యార్థులకు మాత్రమే కాకుండా కాలేజీ రవాణా వ్యవస్థకు కూడా ఎంతో ఉపయోగకరమని తెలిపారు. కార్యక్రమం నిర్వహణకు సహకరించిన కరస్పాండెంట్ డా. విజయ్ శ్రీనివాస్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఆర్‌టీఏ అధికారులను కాలేజీ తరపున సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఫస్ట్ ఇయర్ హెచ్‌ఓడీ డా. సురియా షిహాబ్, డా. మీరా షరీఫ్, డా. జి. ప్రసాద్, శైలజలతో పాటు కందూకూరు ఆర్‌టిఏ శాఖ సిబ్బంది, అధ్యాపకులు, బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

# కేకే ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన అలహరి సుధాకర్





కావలి, అక్షర విజేత,

జనసేన మంగళగిరి పార్టీ కార్యాలయంలో కావలి నియోజకవర్గ ఇంచార్జి అళహరి సుధాకర్ ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ పదవీ బాధ్యతలు తీసుకోబోతున్న జనసేన పార్టీ స్టేట్ ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్ కళ్యాణ్ శివ శ్రీనివాస రావు( కేకే ) ని కలిసి పుష్ప గుచ్ఛముతో హృదయ పూర్వక అభినందనలు ,శుభాకాంక్షలు తెలిపారు.

# నారుమడులను పరిశీలించిన విజిలెన్స్ అధికారి ఎం .సత్యశ్రీనివాస్

కందుకూరు, అక్షర విజేత,

పొగాకు నారుమళ్ళపై విజిలెన్స్ అధికారి ప్రాంతీయ కార్యాలయం ఒంగోలు ఎమ్. సత్యశ్రీనివాస్ కందుకూరు వేలం కేంద్రం నెంబరు: 26,27 పరిధిలోని కూనిపాలెం,

పోలినేనిపాలెం, ఓగూరు, పొన్నలూరు , జి. ఉప్పలపాడు గ్రామములో పెంచుతున్న నారుమడులను తమ బృందంతో శుక్రవారంతనిఖీ చేశారు.ఈ క్రమములో విజిలెన్స్ అధికారి మాట్లాడుతూ గత సంవత్సర అనుభవాలను పొగాకు రైతులు పొగాకుమ్ముకొనుటకు ఎదురుకొన్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని 2025-26 పంట కాలమునకు నారుమడి దశ నుండే పొగాకు బోర్డు పొగాకు పంట సాగును నియంత్రించే విధముగా చర్యలను చేపడుతుందని తెలియచేసారు. పొగాకు నారుమడులు వాణిజ్య సరళిలో పెంచే పొగాకు రైతులు నారుమడి పెంపకము దార్లు తప్పని సరిగా పొగాకు బోర్డు కార్యాలయముల యందు తమ నారుమడులను రిజిస్ట్రేషన్ చేయించు కొనవలెననియు గరిష్టంగా 5 ఎకరములకు రిజిస్ట్రేషన్ పొందవచ్చని తెలియచేసారు. ప్రతి నారుమడుల వద్ద నారుమడి యజమానులు వారియొక్క నారుమడి రిజిస్ట్రేషన్ కు సంబంధించి టీబీఎన్ఆర్ నంబర్, విత్తనం రకం,



విత్తన మూలం, విత్తిన తేది విత్తిన విస్తీర్ణం వివరములతో ఫ్లెక్సీ బోర్డులను ఏర్పాటు చేయవలెనని అన్నారు. పొగాకు బోర్డు రిజిస్ట్రేషన్ లేకుండా ఎవరూ నారుమడులను పెంచరాదని, ఎవరైనా ఆ విధముగా పెంచిన యెడల పొగాకు బోర్డు చట్టంలోని నిబంధనలను ప్రకారము వారిపై చర్యలు తీసుకుంటుందని, దీనికి సంబంధించి నారుమడులను ప్రత్యేక అధికారుల బృందం (నారుమడులు) తనిఖీ చేస్తుందని చెప్పారు.

అంతే కాకుండా ఎఫ్ సి విరకం పొగాకు నారును నారుమడి పెంపకం దారులు పొగాకు బోర్డు లో రిజిస్టర్ అయిన రైతులకు కాకుండా రిజిస్ట్రేషన్ లేని వ్యక్తులకు నారును అమ్మరాదు. పొగాకు రైతులు నారు కొనేటప్పుడు రిజిస్టర్ కాబడిన నారుమడుల నుండే నారును కొనుగోలు చేయవలెనని, రిజిస్టర్ కాబడిన నారుమడి పెంపకం దారులకు పొగాకు బోర్డు నారు అమ్మకమునకు సంబంధించి రశీదు పుస్తకములు సరఫరా చేయడం జరుగుతుందని చెప్పారు. పొగాకు రైతులు ఎఫ్ సి వి రకం పొగాకు నారును కొనుగోలు చేసిన తరువాత నారుమడి యజమానుల వద్ద నుండి నారు కొనుగోలుకు సంబంధించి రశీదును పొందవలెను. ఆ విధంగా పొందిన రశీదును ఫారం - 2 కు (మొక్క ఫారం) జతపరచి సంబంధిత పొగాకు బోర్డు కార్యాలయములో దాఖలు పరచవలయునీ చెప్పారు. రిజిస్ట్రేషన్ లేని పొగాకు నారుమడుల నుండి నారు కొనుగోలు చేసిన పొగాకు రైతుల రిజిస్ట్రేషన్ నిలుపుదల చేయబడుతుందని మరియు పొగాకు నారు లభ్యత గురించి నారుమడులను పెంచిన రైతుల వివరాలను పొగాకు బోర్డు వారు పొగాకు రైతులకు తెలియచేస్తారని చెప్పారు.

ఎఫ్ సి వి రకం నారుమడి పెంపకం దారులు అందరూ తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించు కొనవలెననియు, లేని యెడల పొగాకు బోర్డు చట్టం ప్రకారం తగు చర్యలు తీసుకొనబడునని తెలియచేశారు.ఈ కార్యక్రమములో విజిలెన్స్ బృందం తో పాటు పొగాకు బోర్డు అధికారులు వేలం నిర్వహణాధికారి బి. చంద్రశేఖర్, ఎస్ జి ఓ రాజగోపాల్ , క్షేత్ర సహాయకులు మోతీలాల్, రామకృష్ణ, జ్యోత్స, పి.సి.లు పాల్గొన్నారు

# ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి వేడుకలు

## -బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే :టిడిపి నాయకులు

కందుకూరు, అక్షర విజేత,

కందుకూరు నియోజకవర్గ శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు స్థానిక టీడీపీ కార్యాలయంలో మహనీయులు, సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, నవయుగ వైతాళికుడిగా కీర్తించబడిన మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి టీడీపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ, సామాజిక న్యాయం, సమానత్వం కోసం మహాత్మా జ్యోతిరావు పూలే చేసిన సేవలను కొనియాడారు. ఆయన ఒక గొప్ప సంఘ సంస్కర్త, సామాజిక న్యాయ పితామహుడిగా చరిత్రలో నిలిచిపోయారు. పూలే ఆశయాల సాధనలో భాగంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ఎల్లప్పుడూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, సంక్షేమానికి కృషి చేశారని తెలిపారు. జ్యోతిరావు పూలే చూపిన



మార్గంలో పయనిస్తూ, సమాజంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు మరియు మహిళలందరూ ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని టీడీపీ నాయకులు స్పష్టం చేశారు. కందుకూరు నియోజకవర్గంలో కూడా సామాజిక న్యాయాన్ని సాధించడమే లక్ష్యంగా, టీడీపీ బలంగా, ఐక్యంగా పనిచేస్తుందని వారు ప్రకటించారు. పేద, వెనుకబడిన వర్గాలకు సాధికారత, రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంలో తెలుగుదేశం పార్టీ నిరంతరం కృషి చేస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్



డైరెక్టర్ చిలకపాటి మధుబాబు, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు ముచ్చు వేణు, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, బెజవాడ ప్రసాద్, వడ్డెళ్ళ రవిచంద్ర, ముచ్చు శ్రీనివాసరావు, చుండూరి శ్రీను, భవనాసి వెంకటేశ్వర్లు, గుమ్మా శివ, పసుపులేటి రమణయ్య, షేక్ సలాం, మధిర మధు, పీలా శ్రీనివాసరావు, చీదెళ్ళ పిచ్చయ్య, మచ్చా మనోహర్, చల్లా మహేంద్ర, నీలిశెట్టి శివరామకృష్ణ, నందికనమళ్ళ లక్ష్మణరావు, వెంకట్రావు, గుమ్మడి శివ, కంకణాల వెంకటేశ్వర్లు, కందల రాజశేఖర్, ఆత్మకూరి చంద్రశేఖర్, ఉప్పుగుండూరి రమేష్, మనపాటి సుబ్బరాజు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# పూలే ఆశయ సాధన కోసం బుర్రా నాయకత్వంలో ఐక్యంగా పనిచేస్తాం

## -: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు

కందుకూరు, అక్షర విజేత,

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సామాజిక తత్వవేత్త, నవయుగ వైతాళికుడు మహాత్మా జ్యోతిరావు పూలే 135 వర్ధంతి సందర్భంగా ఆ స్ఫూర్తి ప్రదాతను స్మరించుకుంటూ స్థానిక పామూరు రోడ్ లోని వైఎస్ఆర్సిపి కార్యాలయంలో ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ ఆదేశాల మేరకు వర్ధంతి కార్యక్రమం జరిగినది. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి నాయకులు మహాత్మ జ్యోతిబాపూలే కి ఘనంగా నివాళులర్పించి మాట్లాడుతూ సాంఘిక సంస్కర్త సామాజిక న్యాయ పితామహుడు మహాత్మ జ్యోతిబాపూలే ఆశయాలను మాజీ ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రములో అమలు చేసి బడుగు బలహీన వర్గాల ప్రజలను సాధికారత, రాజ్యాధికారం వైపు నడిపించారని కొనియాడారు. పూలే చూపించిన మార్గంలో ఎస్సీ, ఎస్టీ,బీసీ,మైనార్టీలు, మహిళలు అందరూ ఐక్యంగా నడవాల్సిన అవసరం ఉందని వైఎస్ఆర్సిపి నాయకులు అన్నారు. కందుకూరు నియోజకవర్గంలో సామాజిక న్యాయ సాధన కోసం బీసీ సామాజిక న్యాయ నాయకులు బుర్రా మధుసూదన్ యాదవ్ నాయకత్వంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కలసి ఐక్యంగా పనిచేస్తుందని తెలిపారు. ముందుగా మహాత్మ జ్యోతిబాపూలే,సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ, బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు ద్రోణాదుల చైతన్య, జిల్లా జనరల్ సెక్రెటరీ తోకల కొండయ్య, రాష్ట్ర బూత్ కమిటీ జాయింట్ సెక్రెటరీ గణేశం గంగిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ముప్పవరపు కిషోర్, జిల్లా ఎస్సీ సెల్ నాయకులు గేరా మనోహర్, రాష్ట్ర ప్రచార కమిటీ నాయకులు వల్లూరి కోటేశ్వరరావు,పట్టణ ఉపాధ్యక్షులు తల్లపనేని గోపి, పట్టణ ప్రచార అధ్యక్షులు కొల్లిపర శ్రీనివాసులు, పట్టణ రైతు అధ్యక్షులు చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు. పార్టీ బీసీ నాయకులు కొచర్ల కొండయ్య, ద్రోణాదుల మణిబాబు, పేయ్యల రమణయ్య, కొంచర్ల మాల్యాద్రి, యల్లావుల మురళి కృష్ణ, ఉప్పుటూరి నాగేశ్వరరావు, ఉండేల కొండారెడ్డి, మహమ్మద్ ఫైరోజ్, దాసరి





మహేష్, కూరపాటి వెంకట్రామిరెడ్డి, జిల్లెలముడి కోటేశ్వరరావు, షేక్ సుల్తాన్, చల్లా శ్రీనివాసులు, గంగాడి వెంకట్రావు, పట్టణ మహిళా అధ్యక్షురాలు కొత్తగొర్ల వసంత లక్ష్మి, అంగనవాడి అధ్యక్షురాలు దేవరకొండ ఆదిలక్ష్మి, తన్నీరు ధరణి తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు

## కావలి ఏరియా హాస్పిటల్ లో బీసీ ఐక్యత భవన్ మెగా రక్తదాన శిబిరం

కావలి, అక్షర విజేత,

కావలి పట్టణంలోని బీసీ ఐక్యత భవన్ రాష్ట్ర నాయకులు మహాత్మ జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం కావలి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న మాగుంట పార్వతమ్మ ట్రంక్ రోడ్డులో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడుతూ జేజేలతో నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యత భవన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఉరిటి గోవిందు,వ్యవస్థాపక అధ్యక్షులు చిన్ని వరప్రసాదరావు,ప్రధాన కార్యదర్శి పరిశుద్ధరావు,లాయర్ సాయి ప్రసాద్,లాయర్ అభిసాగర్, జయప్రకాష్,లోక్ సత్తా మాలకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కావలి పట్టణంలోని ఏరియా హాస్పిటల్ నందు బీసీ ఐక్యత భవన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి బిసి ఐక్యత భవన్ రాష్ట్ర నాయకులు,రాజకీయ పార్టీ నేతలు,స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు,ప్రభుత్వ డాక్టర్లు పూలదండలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిజెపి సీనియర్ నాయకులు జిల్లా టెలికం అడ్వైజర్ కమిటీ సభ్యులు కుట్టుబోయిన బ్రహ్మానందం మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి మహాత్మ జ్యోతిరావు పూలే ఎంతో కృషి చేశారని ముఖ్యంగా ఆనాడు మహిళలకు విద్యను అందించడం కోసం తన భార్యను టీచరుగా తయారుచేసి మహిళలకు బాలికలకు విద్యను అందించి ఎంతో ప్రోత్సహించారని తెలిపారు. అదేవిధంగా ఆనాడు మాసూచి కలరా అంటువ్యాధులతో ప్రజలు భయభ్రాంతులైన సందర్భంలో వ్యాధిగ్రస్తులైన వారికి సేవలు చేసిన నిస్వార్థపరుడని ఒకానొక సందర్భంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తన గురువు మహాత్మ జ్యోతిరావు పూలే అని కొనియాడారని తెలిపారు. తరువాత ఏరియా హాస్పిటల్ బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ విజయవాణి మాట్లాడుతూ బీసీ ఐక్యత భవన్ నాయకుల ఆధ్వర్యంలో సంవత్సరానికి రెండు సార్లు రక్తదానం కార్యక్రమాలు పెట్టి రక్తదానం చేయడం అభినందనీయమని ఏరియా హాస్పిటల్ లోని గర్భిణీలకు, సర్జరీలకు,యాక్సిడెంట్ అయిన వారికి రక్తం అవసరం అవుతుందని యువత రక్తదానం చేయడం అలవాటు చేసుకోవాలని చెప్పారు. తరువాత బీసీ ఐక్యత భవన్ ప్రధాన కార్యదర్శి నాయుడు పరిశుద్ధరావు మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే చేసిన సేవలను గుర్తించుకొని ఆయన బాటలో రక్తదానం కార్యక్రమం చేశామని ముందు ముందు ఇటువంటి



కార్యక్రమాలు భారీ స్థాయిలో చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు మంద కిరణ్,వివిధ స్వచ్ఛంద సంస్థల గౌరవ అధ్యక్షుడు షేక్ ఖాదర్ భాష,రిటైర్డ్ టీచర్ బిసి నేత కోటేశ్వరరావు,వి సేవా ఫౌండేషన్ బ్లడ్ మోటివర్ వినయ్ కుమార్,బ్లడ్ బ్యాంకు ల్యాబ్ టెక్నీషియన్ రాజశేఖర్,సిస్టర్ నూర్జహాన్,సిబ్బంది పాల్గొన్నారు.




# సీనియర్ కార్మికులను సత్కరించిన ఆర్టీసీ చైర్మన్

## స్వచ్ఛ ఆర్టీసీ అందరి లక్ష్యం కావాలి - ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి

కావలి, అక్షర విజేత,

స్త్రీ శక్తి పథకం విజయవంతం అవడంలో గ్యారేజ్ కార్మికుల కృషి అభినందనీయం అని ఎపియస్ ఆర్టీసీ, నెల్లూరు జోన్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అయన కావలి డిపో గ్యారేజ్ ను సందర్శించారు. గ్యారేజ్ శుభ్రత నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా గ్యారేజ్ పనిచేస్తున్న సీనియర్ మెకానికల్ సిబ్బందిని, ఒప్పందపు కార్మికులను సత్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, గతంలో 65 శాతం ఉన్న అక్యూపేషన్ రేషియో 100 శాతంకు పైగా





పెరిగిందని అన్నారు. పెరిగిన ప్రయాణికుల రద్దీకి తగిన విధంగా బస్సులను దృఢపరచి, సిద్ధం చేయడంలో గ్యారేజ్ సిబ్బంది పాత్ర క్రియాశీలమైనదని ఆయన అన్నారు. అదే విధంగా బస్టాండ్ మరియు గ్యారేజ్ లను శుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య సిబ్బంది పనితీరును కూడా మరువజాలదని వివరించారు. పారిశుధ్య విభాగంలో పనిచేసే సిబ్బందికి పియఫ్ సౌకర్యంతో పాటు, ఆరోగ్య పరిరక్షణకు ఈయస్ఐ సౌకర్యం కూడా కల్పించామని,ఏ సౌకర్యాలను వినియోగించుకోవాలని అయన అన్నారు. బస్టాండ్ మరియు గ్యారేజ్ చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడంలో,మునిసిపల్ కమీషనర్ సహకరించేలా శాసనసభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డితో మాట్లాడుతానని ఆయన చెప్పారు. బస్టాండ్ లో ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్, నూతన మరుగుదొడ్లు ఏర్పాటుకు ప్రయత్నం చేస్తానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ, తమ సంక్షేమంపై శ్రద్ధ చూపిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలియజేసారు. డిపో మేనేజర్ డి ఆదినారాయణ మాట్లాడుతూ, జోనల్ చైర్మన్ సురేష్ రెడ్డి గారి ఆకాంక్షలకు అనుగుణంగా డిపోను తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్ ) బి మల్లికార్జున, అసిస్టెంట్ మేనేజర్ ( ట్రాఫిక్ ) యం కల్పన, ఉద్యోగసంఘ నాయకులు పాల్గొన్నారు.

# సిఐటియు అఖిలభారత 18వ మహాసభలు జయప్రదం చేయండి..

## -జిల్లా కార్యదర్శి రాయళ్ల

వెలిగండ్ల, అక్షర విజేత, :

సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్( సిఐటియు) 18వ అఖిలభారత మహాసభలు 2025 డిసెంబర్ 31 నుండి 2026 జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరిగే మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ వెలిగండ్ల మండల సిఐటియు కమిటీ సమావేశం ప్రజాసంఘాల కార్యాలయంలో శుక్రవారంఏ. అలేఖ్య ( రమణ) అధ్యక్షతన జరిగినది. అనంతరం జిల్లా కార్యదర్శి రాయళ్ల మాల కొండయ్య మాట్లాడుతూ, సీఐటీయూ ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా ఆంధ్రప్రదేశ్లో జరగటం మన రాష్ట్రానికే గర్వకారణం .స్వాతంత్రోద్యమ వారసత్వంలో పుట్టి కార్మిక వర్గ ఆశయానికి అంకితమైన సమస్త



సిఐటియు. దేశవ్యాప్తంగా యావత్తు కార్మిక వర్గాన్ని ఐక్యపరచడం సిఐటియు ఆశయము, కార్మిక కర్షిక ఐక్యతతో పెట్టుబడుదారి విధానాన్ని కూల్చి కార్మిక రాజ్యాన్ని స్థాపించడం సిఐటియు లక్ష్య%శీ% అని. ఈ ఆశయ సాధన ద్వారానే కార్మిక వర్గం నేడు ఎదుర్కొనే సర్వ సమస్యలను పరిష్కరిస్తుందని సోషలి జమే ఒకటే నేటి సమస్యలకు సరైన మార్గమని , యావత్ కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి కార్మిక హక్కుల కోసం దేశవ్యాప్తంగా పోరాడే మహత్తర కర్తవ్యం ఎలా నిర్వహించాలో ఈ మహాసభ చర్చిస్తుందని, భవిష్యత్తు కార్యచరణ రూపొందిస్తుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో బొప్పరాజు అనంతలక్ష్మి, ప్రభావతి, దేవరకొండ కాశమ్మ ,రాయళ్ల వెంకటసుబ్బమ్మ, కాకర్ల నాగేశ్వరి ,ఆర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్, కాలేజీ బస్సుల తనిఖీలు నిర్వహించిన రవాణా శాఖ అధికారులు

కందుకూరు, అక్షర విజేత,


ప్రభుత్వం ఆదేశాల మేరకు కందుకూరు ప్రాంతీయ రవాణా శాఖ అధికారి టీవీ నాగలక్ష్మి ఆధ్వర్యంలో కందుకూరు నియోజకవర్గ పరిధిలోని స్కూల్ మరియు కాలేజి బస్సుల తనిఖీలు నిర్వహించుట జరిగినది. ఇందులో భాగంగా కందుకూరు ప్రాంతీయ రవాణాశాఖ అధికారి టీవీ నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్క స్కూల్ మరియు కాలేజీ యాజమాన్యం వారు తమ యొక్క బస్సులకు సంబంధించి ఫిట్నెస్, పర్మిట్ మరియు టాక్స్ లు చెల్లుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని అదేవిధంగా విద్యార్థుల భద్రతే ముఖ్య లక్ష్యం దీనికోసం బస్సులలో భద్రత ప్రమాణాలు పాటించాలని అందులో భాగంగా బస్సులో ఫస్ట్ ఎయిడ్ కిట్ మరియు అగ్నిమాపక యంత్రం తప్పనిసరిగా ఉండాలని ఏదేని సమయంలో ప్రమాదం సంభవించినప్పుడు ఎమర్జెన్సీ ఎగ్జిట్ ద్వారా బయటికి వెళ్ళడానికి వీలుగా ఉండేలా చూసుకోవాలని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా కందుకూరు ఎంవిఐ జె అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్క స్కూల్ మరియు కాలేజి యాజమాన్యం వారు బస్సుల యొక్క భద్రతా ప్రమాణాలు తప్పకుండా పాటించాలని, విద్యార్థిని విద్యార్థులను బస్సు పూర్తిగా ఆగేవరకు ఎక్కడం లేదు దిగడం చేయవద్దని, ప్రతి బస్సుకి వేగ నియంత్రణ పరికరం అమర్చాలని, 2023 అక్టోబర్ తరువాత రిజిస్ట్రేషన్ అయిన బస్సులకు తప్పని సరిగా ఎఫ్ టి ఎస్ ఎస్ సిస్టమ్ ఉండాలని తెలియచేశారు.



# స్పిరిట్ షూట్‌లో ప్రభాస్ బిజీ



యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా చిత్రం 'స్పిరిట్' షూటింగ్ మొదలైంది.స్పిరిట్' కోసం రంగంలోకి దిగారు కథానాయకుడు ప్రభాస్. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ముస్తాబవుతున్న బహుభాషా చిత్రమిది. భద్రకాళి పిక్చర్స్ ప్రొడక్షన్స్, టీ సిరీస్ ఫిల్మ్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. త్రిప్తి దిమ్రీ కథానాయిక. ఇటీవలే లాంఛనంగా మొదలైన ఈ సినిమా హైదరాబాద్‌లో రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించుకుంది. దీనికోసం ప్రభాస్ గురువారం సెట్‌లోకి అడుగు పెట్టారు. ప్రస్తుతం ఆయనపై ఓ భారీ పోరాట ఘట్టాన్ని తెరకెక్కిస్తున్నట్లు తెలిసింది. ప్రత్యేకంగా సిద్ధం చేసిన ఓ భారీ సెట్‌లో ఈ షూట్ నిర్విరామంగా కొనసాగనుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల్ని అలరించడమే లక్ష్యంగా భారీ హంగులతో యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందనుంది. ప్రభాస్ ఇందులో శక్తిమంతమైన ఐపీఎస్ అధికారిగా సరికొత్త లుక్‌తో కనువిందు చేయనున్నారు. దీనికి హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. హీరో ప్రభాస్ శుక్రవారం నుంచి నేరుగా 'స్పిరిట్' సెట్స్‌లో జాయిన్ అయ్యారు. ప్రభాస్ తన షెడ్యూల్‌లో భాగంగా డిసెంబర్ నెలాఖరు వరకు హైదరాబాద్‌లో తన పాత్రకు సంబంధించిన సన్నివేశాలను పూర్తి చేయనున్నారు. ఈ షెడ్యూల్ పూర్తయిన తర్వాత, చిత్ర బృందం న్యూ ఇయర్ విరామం తీసుకోనుంది. కొత్త సంవత్సరం ప్రారంభంలోనే 'స్పిరిట్' చిత్ర యూనిట్ అంతా విదేశాలకు పయనం కానుంది. సినిమా రెండో షెడ్యూల్ వచ్చే ఏడాది ప్రారంభంలో మెక్సికోలో మొదలుకానుంది. మెక్సికోలో చిత్రీకరించే సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని తెలుస్తోంది. సందీప్ రెడ్డి వంగా తనదైన మార్కుతో ఈ చిత్రాన్ని ఎలా రూపొందిస్తారనే దానిపై ప్రభాస్ అభిమానులతో పాటు సినీ ప్రియుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి.





# భారీ అంచనాల మధ్య 5న వస్తోన్న దురంధర్

బాహుబలి, పుష్ప2 లాంటి భారీ సినిమాల దెబ్బకి బాలీవుడ్ కూడా పూర్తిగా మారిపోయింది. ఇప్పటి దాకా లవ్ రొమాంటిక్ ఎంటర్ టైనర్స్ తో ఆకట్టుకున్న రణవీర్ సింగ్ కూడా ఇప్పుడు భారీ యాక్షన్ వైపు టర్న్ తీసుకుని,'ధురంధర్'అనే మాస్ యాక్షన్ థ్రిల్లర్ తో వస్తున్నాడు. రణ్‌వీర్ సింగ్, సారా అర్జున్ కాంబినేషన్ లో డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు వస్తోంది దురంధర్. ట్రూ ఇన్సిడెంట్స్ ఆధారంగా రూపొందించబడిన ఈ సినిమాను 'ఉరి' దర్శకుడు ఆదిత్య ధర్ 250 కోట్ల భారీ బడ్జెట్ తో తెరకెక్కించాడు. ఇప్పటి కే రిలీజ్ అయిన ట్రయిలర్ సోషల్ మీడియాలో ట్రెండింగ్ లో ఉంది. బి-టౌన్‌లో ఇప్పుడు పెద్ద చర్చ నడుస్తోంది. ఈ సినిమా మేజర్ మోహిత్ శర్మ బయోపిక్ అని రూమర్స్ రావడంతో దర్శకుడు క్లారిటీ ఇస్తూ 'మోహిత్ శర్మ త్యాగం గొప్పది కానీ దానికి దురంధర్‌కి సంబంధం లేదు. టైమ్ వచ్చాక ఆయన బయోపిక్‌ను గొప్పగా చేస్తాం అని అన్నారు. ఇదిలా ఉండగా ఈ సినిమా 3 గంటల 32 నిమిషాల రన్‌టైమ్ తో వస్తోంది. దాంతో దురంధర్ కూడా ఇండియా లాంగెస్ట్ రన్‌టైమ్ మూవీస్ లిస్ట్‌లోకి ఎంటర్ అవుతుంది. పాన్ ఇండియా వేవ్‌లో భాగంగా ఆర్‌ఆర్‌ఆర్, పుష్ప 2, కల్కి, బాహుబలి ఎపిక్ లాంటి సినిమాలు లాంగ్ రన్‌టైమ్ తోనే రిలీజ్ అయ్యాయి. పాన్ వరల్డ్ హైప్ తో వచ్చి ఘన విజయం సాధించాయి కూడా. ఈ నేపథ్యంలో బాలీవుడ్ కూడా ఆ రూట్లో అడుగు వేస్తోందా అనే చర్చ బలంగా వినిపిస్తుంది.

# వారణాసిలో చిన్నప్పటి మహేశ్‌గా దర్శన్


దర్శక దిగ్గజం రాజామౌళి దర్శకత్వంలో సూపర్ స్టార్ మహేశ్ బాబు నటిస్తున్న భారీ చిత్రం వారణాసి. ఈ పాన్ వరల్డ్ మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇటీవల రిలీజ్ చేసిన 'రుద్ర' గ్లిమ్స్ కు భారీ స్పందన లభించింది. ప్రస్తుతం హైదరాబాద్ లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో షూట్ జరుగుతోంది. ఈ షెడ్యూల్ లో మహేశ్ చిన్నప్పటి సన్నివేశాలు తీస్తున్నారు. అయితే మహేశ్ చిన్నప్పటి రోల్ లో యంగ్ టైగర్ ఎన్టీఆర్ కొడుకు భార్గవ్ నటిస్తున్నాడని రెండు రోజుల నుండి సోషల్ మీడియాలో వార్తలు హల్ చల్ చేశాయి. ఈ విషయమై వారణాసి టీమ్ ను సంప్రదించగా అసలు అటువంటిది ఏమి లేదని తేల్చి చెప్పారు. ఎన్టీఆర్ కొడుకు నటిస్తున్నాడనేది పక్కా ఫేక్ న్యూస్. ఇక్కడే మరో ఆసక్తికర విషయం తెలిసింది. సూపర్ స్టార్ కృష్ణ చిన్నల్లుడు ప్రిన్స్ మహేశ్ బాబు బావ హీరో సుధీర్ బాబు కుమారుడు దర్శన్ నటిస్తున్నాడు. అందుకు సంబంధించి షూట్ కూడా చేస్తున్నారు. సుధీర్ బాబు చిన్న కొడుకు దర్శన్ ఆల్రెడీ అడివి శేష్ గూఢచారి, మహేష్ బాబు సర్కారు వారి పాట సినిమాల్లో చైల్డ్ ఆర్టిస్ట్ గా కనిపించాడు. దర్శన్ నటనకు మంచి ప్రశంసలు దక్కాయి. అలాగే హను రాఘవపూడి డైరెక్షన్ లో వస్తున్న ఫౌజీలోను ప్రభాస్ చిన్నప్పటి రోల్ లో దర్శన్ నటించబోతున్నాడు.






## గ్లామర్‌లోనే కాదు అభినయంలోను భాగ్యశ్రీ ది గ్రేట్

ఎవరికైనా ఒక టైమ్ రావాలి. అలాంటి టైమ్ కలిసొచ్చింది భాగ్యశ్రీకి. కేవలం గ్లామరస్ పాత్రల్లోనే కాదు, నటించేందుకు అవకాశం ఉన్న పాత్రలు ఆఫర్ చేస్తే, తాను కూడా తగ్గేదేలే అని ఇటీవల నిరూపిస్తోంది. ఇంతకుముందు దుల్కర్ సల్మాన్ కాంత సినిమాలో అద్భుత అభినయంతో ఆకట్టుకున్న భాగ్యశ్రీ ఇప్పుడు రామ్ సరసన నటించిన ఆంధ్రా కింగ్ తాలూకాలోను తనదైన అద్భుత ప్రదర్శనతో రక్తి కట్టించింది. గ్లామర్ ని మించి అభినయం. భాగ్యశ్రీ బోర్సే గ్లామర్ డాళ్ ఇమేజ్ నుంచి పూర్తిగా బయటికి వచ్చినట్లే. కాంతలో అదరగొట్టిన ఆమె.. ఆంధ్ర కింగ్ తాలూకా లోనూ ఆకట్టుకుంది అంటూ ప్రశంసలు కురుస్తున్నాయి. అందంతో పాటు అభినయంతోనూ భాగ్యశ్రీ మెప్పించింది. సినిమాలోని కీలక సన్నివేశాలలో తన అభినయానికి క్రిటిక్స్ మంచి మార్కులే వేసారు. ముఖ్యంగా భాగ్యశ్రీ గ్లామర్ డాళ్ అనుకుంటే, తనలోని నటిని ఈ సినిమాలో చూడొచ్చు! అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. రామ్ ఇంతకుముందు ప్రీరిలీజ్ వేదికపై భాగ్య శ్రీ గురించి అంత ఎమోషనల్ గా ఎందుకు మాట్లాడాడో ఈ సినిమా చూసిన తర్వాత ప్రజలకు అర్థమైంది. భాగ్యశ్రీ ఇంత గ్లామర్ డాళ్ లా ఉంది.. కానీ ఆడిషన్స్ లో తన అభినయం చూసి వెంటనే ఓకే చేసామని రామ్ చెప్పారు. దానికి తగ్గట్టే భాగ్యశ్రీ సినిమా ఆద్యంతం నటిగా రాణించింది. ఆంధ్రా కింగ్ తాలూకా చిత్రానికి క్రిటిక్స్ యునానిమస్ గా అద్భుతమైన రేటింగులు ఇచ్చి ప్రోత్సహించారు. వరుస విజయాలతో దూకుడు.. ఇప్పుడు కాంత, ఆంధ్రా కింగ్ తాలూకా లాంటి విజయాలతో భాగ్యశ్రీ రేంజ్ అమాంతం పెరగనుంది. పారితోషికాన్ని చుక్కల్లోకి తీసుకెళ్లే కథానాయికల జాబితాలో భాగ్యశ్రీ కూడా చేరిపోనుంది. ఈ రెండు విజయాలతో భాగ్యశ్రీ ఫోటోషూట్ల పరంగాను దూకుడును ప్రదర్శిస్తోంది. తాజా ఫోటోషూట్ లో ఈ ముగ్ధమనోహరి అందచందాలు మరో లెవల్ లో ఎలివేట్ అయ్యాయి. సింపుల్ డిజైనర్ డ్రెస్ లో భాగ్యశ్రీ ఎంతో క్యూట్ గా లవ్వబుల్ గా కనిపిస్తూనే, తనలోని గ్లామర్ ని ఎలివేట్ చేసిన తీరుకు బోయ్స్ ముగ్ధులైపోతున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది. ప్రతిభకు పట్టం: టాలీవుడ్ లో అత్యంత వేగంగా ఎదిగేసిన కథానాయికల జాబితాలో సాయిపల్లవి, కియరా అద్వాణీ, రష్మిక మందన్న, శ్రీలీల పేర్లు మార్మోగుతున్నాయి. ప్రతిభకు ప్రజలు పట్టంగడగారనడానికి వీరంతా ఉదాహరణలు. ఇప్పుడు ఈ జాబితాలో భాగ్యశ్రీ పేరు కూడా చేరిపోనుందని అభిమానులు భావిస్తున్నారు. భాగ్యశ్రీ భవిష్యత్ ఉజ్వలంగా వెలిగిపోవాలని కూడా ఫ్యాన్స్ ఆకాంక్షిస్తున్నారు.




# మీ అభిమానాలే నన్నునిలబెట్టాయి: నవీన్

తన కామెడీ టైమింగ్‌తో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరో నవీన్ పోలిశెట్టి మళ్లీ ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడానికి సిద్ధమయ్యాడు. 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ'తో కెరీర్‌కు బ్రేక్ రాగా, ఆ తర్వాత వచ్చిన 'జాతిరత్నాలు'తో బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ క్రియేట్ చేశాడు. ఇటీవల అనుష్కతో చేసిన 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' కూడా మంచి విజయం సాధించడంతో ఆయన స్టార్ ఇమేజ్ మరింత పెరిగింది. ఇప్పుడీ క్రమంలో తన నాలుగో సినిమాగా 'అనగనగా ఒక రాజు'ని తెరపైకి తీసుకురావడానికి సిద్ధమవుతున్నాడు. అయితే ఈ సినిమా షూటింగ్ ప్రారంభించిన కొద్ది రోజులకే జరిగిన ప్రమాదం నవీన్ కెరీర్‌కు పెద్ద బ్రేక్ ఇచ్చింది. చేతికి, వెన్నెముకకు తీవ్ర గాయాలవడంతో దాదాపు ఏడాది పాటు షూటింగ్‌కు దూరమయ్యాడు. దీర్ఘ విరామం తరువాత ఈ సినిమాను పూర్తిచేసిన నవీన్ ఇప్పుడు సంక్రాంతి 2026 కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు.సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా మేకర్స్ 'అనగనగా ఒక రాజు' ఫస్ట్ సాంగ్‌ను విడుదల చేశారు. నాది సైలెంట్ బ్యాచ్ కాదు.. అల్లరి చేసే బ్యాచ్. నేను ఈరోజు ఈ స్థాయిలో ఉన్నానంటే అది మీ అందరి సపోర్ట్ వల్లే. ఏజెంట్ ఆత్రేయ, జాతిరత్నాలు, మిస్ శెట్టి సినిమాలను మీరు ఎంత ప్రేమించారో తెలుసు. ఈ సినిమాను కూడా అదే ప్రేమతో ఆదరిస్తారని నమ్మకం ఉందన్నాడు.

ఈ సినిమాలో పాట పాడాను, డ్యాన్స్ చేశాను? ఈ సారి పండగకి మీ ముందుకు రానున్నాను' అని అన్నారు. నవీన్ భావోద్వేగ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరోవైపు 'అనగనగా ఒక రాజు'పై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ప్రమాదాన్ని జయించి, ప్రేక్షకుల ముందుకు వస్తున్న నవీన్ ప్రయాణం ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

# ఐపీఎల్‌లో అమ్మకానికి మరో జట్టు!

**-అమ్మకానికి వచ్చిన ఐపీఎల్ ఫ్రాంచైజీలు -ఆర్సీబీతో పాటు రాజస్థాన్ రాయల్స్ కూడా విక్రయం**
**-ప్రముఖ పారిశ్రామికవేత్త హర్ష్ గొయెంకా ఎక్స్ పోస్ట్‌తో వెలుగులోకి**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) వచ్చే సీజన్‌కు ముందు కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంఛైజీ అమ్మకానికి సిద్ధమైనట్లు ప్రకటించగా, తాజాగా ఈ జాబితాలోకి రాజస్థాన్ రాయల్స్ కూడా చేరినట్లు తెలుస్తోంది. ప్రముఖ పారిశ్రామికవేత్త హర్ష్ గొయెంకా చేసిన ఒక సోషల్ మీడియా పోస్ట్ ఈ వార్తలకు బలాన్నిచ్చింది."ఒకటి కాదు.. రెండు ఐపీఎల్ జట్లు అమ్మకానికి ఉన్నాయి. అవే ఆర్సీబీ, రాజస్థాన్ రాయల్స్. వీటిని దక్కించుకునేందుకు నలుగురైదుగురు కొనుగోలుదారులు రేసులో ఉన్నారు. పూణె, అహ్మదాబాద్, ముంబయి, బెంగళూరు, యూఎస్‌ఏ నుంచి కొత్త యజమానులు వస్తారేమో చూడాలి!" అని హర్ష్ గొయెంకా తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. ఈ పోస్ట్ ప్రస్తుతం వైరల్‌గా మారి, క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ప్రస్తుతం రాజస్థాన్ రాయల్స్ జట్టులో రాయల్స్ స్పోర్ట్స్ గ్రూప్‌కు 65 శాతం వాటా ఉంది.ఇదిలా ఉండగా, ఆర్సీబీ యాజమాన్య సంస్థ డియాజియో ఇప్పటికే ఫ్రాంఛైజీ విక్రయ ప్రక్రియను అధికారికంగా ప్రారంభించింది. ఈ విషయాన్ని బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు కూడా తెలియజేసింది. వచ్చే ఏడాది మార్చి 31 నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆర్సీబీని కొనుగోలు చేసేందుకు ప్రముఖ పారిశ్రామికవేత్త అదర్ పూనావాలాతో పాటు మరో రెండు సంస్థలు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. ఈ పరిణామాలతో వచ్చే ఐపీఎల్ సీజన్‌లో ఈ రెండు జట్లు కొత్త యాజమాన్యాల చేతికి వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి.